ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న తొలి తెలంగాణ దినపత్రిక


APTEL/2011/39851

# సామాజిక తెలంగాణ

జాతీయ దినపత్రిక

epaper.samajikatelangana.in

Published from Hyderabad | సంపుటి: 14 | సంచిక: 291 | శుక్రవారం 19-06-2026 | ఎడిటర్: పి.వెంకటరమణ | పేజీలు: 12 | వెల రూ. 5/-





## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాలు: రాష్ట్రవ్యాప్తంగా భారీ ముషాయిరాలు
- యుద్ధప్రాతిపదికన మైనారిటీ గురుకుల భవనాల నిర్మాణం
- 'రాజీవ్ యువ వికాసం' ద్వారా మైనారిటీ యువతకు స్వయం ఉపాధి
- క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ. 50 కోట్లు
- వక్ఫ్ భూముల రక్షణకు కఠినమైన చట్టపరమైన చర్యలు
- మైనారిటీ శ్మశాన వాటికల స్థల సేకరణకు కలెక్టర్లకు ఆదేశాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమీక్ష

హైదరాబాద్ జూన్ 18: (సామాజిక తెలంగాణ): రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా

-మిగతా 2 లో

## ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

### పేదల జోలికి వెళ్లకుండా..కబ్జాదారుల భరతం పడుతోంది

- ఢిల్లీ తరహా కాలుష్య ముప్పు రాకూడదనే హరితహారానికి పెద్దపీట
- ఎవరు అడ్డుపడినా మూసీ నది ప్రక్షాళన, పునరుజ్జీవం జరిగి తీరుతుంది
- మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం
- గుర్రంగూడ ఎకో పార్కులో వనమహోత్సవం.. నాగలింగం మొక్క నాటిన సీఎం
- మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి

రంగారెడ్డి జూన్ 18: (సామాజిక తెలంగాణ): ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతు న్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం

-మిగతా 2 లో






## మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ

- ప్రతిపక్ష నేతగా రితబ్రతనే కొనసాగిస్తూ కోర్టు నిర్ణయం
- అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టు
- పార్టీపై తిరుగుబాటు చేసిన 64 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు
- స్పీకర్ రతీంద్ర బోస్ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమన్న జస్టిస్ కృష్ణా రావు
- మమత పిటిషన్‌పై స్పీకర్, ప్రతివాదులకు కోర్టు నోటీసులు
- అఫిడవిట్ దాఖలుకు ప్రతివాదులకు రెండు వారాల గడువు
- జూలై 28కి తదుపరి విచారణ వాయిదా

న్యూఢిల్లీ

టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. టీఎంసీ రెబల్ నేత రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. ఇప్పటికిప్పుడు ఈ విషయంలో ఎలాంటి మార్పునకు ఆదేశించలేమని కోర్టు తెలిపింది. ఈ మేరకు కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ క్రిష్ణా రావ్ ఈ కేసుపై నిర్ణయం తీసుకున్నారు. టీఎంసీకి చెందిన ఎమ్మెల్యేలు చాలా మంది మమతకు, పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన సంగతి తెలిసిందే. 64 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి, తమ పార్టీ తరఫున రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని బెంగాల్ స్పీకర్ రతింద్ర బోస్‌ను కోరారు. 90 మంది ఎమ్మెల్యేల్లో 64

-మిగతా 2 లో



## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్..!

- నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్
- కేంద్ర ప్రభుత్వం సంచలన ఆరోపణలు.. ఢిల్లీ హైకోర్టుకు నివేదిక
- నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక ఆంక్షలు
- ప్రైవసీ ఫీచర్ల చాటున దగుల్బాజీ ముఠాల గుట్టు
- డ్రగ్స్ అక్రమ రవాణా, ఉగ్రవాద ప్రచారానికి వేదికగా గ్రూపులు
- చైల్డ్ పోర్నోగ్రఫీ, డేటా చోరీపై కేంద్రం తీవ్ర ఆందోళన

న్యూఢిల్లీ, జూన్ 18: (సామాజిక తెలంగాణ): మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు దిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ దిల్లీ హైకోర్టును

-మిగతా 2 లో



## బంగాళాఖాతంలోకి పాకిస్థాన్ సబ్‌మెరైన్..!

- చైనా సాయంతో 'హ్యాంగర్ క్లాస్' జలంతర్గామి కొనుగోలు
- హిందూ మహాసముద్రంలో పరిధిని విస్తరిస్తున్న పాక్
- 1971 యుద్ధం తర్వాత మళ్లీ బంగాళాఖాతంలోకి..
- శత్రు రాడార్లకు చిక్కకుండా నీటిలోనే ఉండే అత్యాధునిక సాంకేతికత
- విశాఖ తూర్పు నౌకాదళ స్థావరానికి కొత్త సవాల్
- చైనా-పాక్ వ్యూహాలకు దీటుగా బదులిచ్చేందుకు భారత్ సన్నద్ధం

న్యూఢిల్లీ జూన్ 18: (సామాజిక తెలంగాణ): భారతదేశానికి అత్యంత కీలకమైన బంగాళాఖాతం లో వ్యూహాత్మక ఉనికిని చాటుకోవడానికి పాకిస్థాన్ నౌకాదళం సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. చైనా సాయంతో తమ నౌకాదళంలోకి కొత్తగా చేర్చుకున్న అత్యాధునిక హ్యాంగర్ క్లాస్ జలాంతర్గాముల ను ఈ ప్రాంతంలో మోహరించాలని పాకిస్థాన్ భావిస్తున్నది.

-మిగతా 2 లో

## రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణ టాప్..!




- షాకింగ్ నిజాలు వెల్లడించిన కేంద్ర నివేదిక
- జాతీయ సగటు కంటే భారీగా పెరిగిన ప్రమాదాలు
- ఏడాది కాలంలోనే 13.5 శాతం పెరుగుదల
- రహదారులపై నెత్తురు.. గతేడాది 7,900 మంది మృతి
- మృత్యుపాశంగా మారుతున్న 'అతివేగం'
- హిట్ అండ్ రన్, డీకొట్టడాలే ప్రధాన కారణాలు
- ప్రమాదాల కట్టడికి రవాణా శాఖ సరికొత్త చర్యలు

2 లో

## అమెరికాపై విజయం సాధించాం



- ప్రకటించిన ఇరాన్
- ఫ్రాన్స్‌లో ట్రంప్-పెజెష్కియాన్ ఒప్పందం
- ట్రంప్ సంతకమే అమెరికా లొంగుబాటుకు సాక్ష్యం
- హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌దే సర్వాధికారం
- ఇజ్రాయెల్ దాడులు ఆపకుంటే ఉల్లంఘనే!
- తుది నిర్ణయానికి 60 రోజుల గడువు

2 లో

## వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం


### 30న రైతు భరోసా నిధులు విడుదల

- మధిర వేదికగా సీఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

హైదరాబాద్ జూన్ 18: (సామాజిక తెలంగాణ): ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ

-మిగతా 2 లో





## యూఏఈలో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం..!

- ఈ ఘనత సాధించిన తొలి అరబ్ దేశంగా రికార్డు
- సొంత అకౌంట్లు, కొన్ని ప్రత్యేక ఫీచర్లపై పూర్తి ఆంక్షలు
- చిన్నారుల డిజిటల్ భద్రతే లక్ష్యమన్న యూఏఈ ప్రభుత్వం
- నిబంధనల మార్పు కోసం సోషల్ మీడియా సంస్థలకు ఏడాది గడువు
- రోజుకు సగటున 3 గంటలు సోషల్ మీడియాలోనే.. సర్వేలో విస్తుపోయే నిజాలు
- ఆస్ట్రేలియా, యూకే బాటలోనే పయనిస్తున్న యూఏఈ
- దశల వారీగా కొత్త నిబంధనల అమలుకు ప్రణాళికలు

న్యూఢిల్లీ,

సామాజిక మాధ్యమాలు పిల్లలపై దుష్ప్రభావం చూపుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా కట్టడికి పలు దేశాలు కొత్త చట్టాలు తీసుకొస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలో అరబ్ దేశం యూఏఈ కూడా చేరింది. సామాజిక మాధ్యమ వేదికల వినియోగానికి కనీస వయసును 15 ఏళ్లుగా నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గురువారం ఆమోదించింది. దాంతో ఈ తరహా నిబంధన తీసుకొచ్చిన తొలి అరబ్ దేశం గా యూఏఈ నిలిచింది.కొత్త నిబంధనల ప్రకారం.. 15 ఏళ్లలోపు చిన్నారులు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఖాతాలను తెరిచేందుకు అనుమతి ఉండదు. అంతేకాదు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లోని కొన్ని రకాల ఫీచర్లపై వీరికి యాక్సెస్ కల్పించకూడదు. వయసు సంబంధిత కంటెంట్‌పై ఆంక్షలు, స్క్రీన్ టైమ్, యాప్ వినియోగ సమయంపై పరిమితి వంటి రూల్స్‌ను ఆయా ప్లాట్‌ఫామ్‌లు తీసుకురావాల్సి ఉంటుంది. సోషల్ మీడియాతో పిల్లలకు పొంచి ఉన్న ముప్పును తప్పించడంతో పాటు ఆరోగ్యకరమైన డిజిటల్ వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ నిబంధనలు తీసుకొచ్చినట్లు యూఏఈ ప్రభుత్వం వెల్లడించింది. ఈ కొత్త నిబంధనలకు అనుగుణంగా ప్లాట్‌ఫామ్‌ల్లో మార్పులు చేసేందుకు సోషల్ మీడియా కంపెనీలకు యూఏఈ

-మిగతా 2 లో



## దోచుకోవడం బీఆర్ఎస్ పేటెంట్ హక్కు

- కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జీవన్ రెడ్డి వాటా ఎంతో చెప్పాలి
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కరీంనగర్ జూన్ 18: (సామాజిక తెలంగాణ): దోచుకోవడం.. దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీ పేటెంట్ హక్కు అని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో జీవన్ రెడ్డికి వచ్చిన వద్ద కమీషన్ ఎంతో చెప్పాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. హరీశ్‌రావు మెప్పు పొందడానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తనపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో గురువారం

-మిగతా 2 లో

# రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణ టాప్..!

- షాకింగ్ నిజాలు వెల్లడించిన కేంద్ర నివేదిక
- జాతీయ సగటు కంటే భారీగా పెరిగిన ప్రమాదాలు
- ఏడాది కాలంలోనే 13.5 శాతం పెరుగుదల
- రహదారులపై నెత్తురు.. గతేడాది 7,900 మంది మృతి
- మృత్యుపాశంగా మారుతున్న 'అతివేగం'
- హిట్ అండ్ రన్, డీకొట్టడాలే ప్రధాన కారణాలు
- ప్రమాదాల కట్టడికి రవాణా శాఖ సరికొత్త చర్యలు




దేశంలోని ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 22,903 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 25,986 కి చేరింది. కేవలం ఏడాది కాలంలోనే ప్రమాదాల సంఖ్య 13.5 శాతం పెరగడం గమనార్హం. ఇది జాతీయ సగటు వృద్ధిరేటు (1.5 శాతం) కంటే చాలా రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. ఈ ప్రమాదాల కారణంగా సంభవిస్తున్న మరణాల సంఖ్య సైతం భారీగానే ఉంది. 2024లో రాష్ట్రంలో జరిగిన వివిధ ప్రమాదాల్లో సుమారు 7,900 మంది ప్రాణాలు కోల్పోయారు. మరణాల వృద్ధిరేటు (3.7 శాతం) దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే అత్యధికంగా నమోదైంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మితిమీరిన వేగాన్ని అధికారులు గుర్తించారు. ఒక్క అతివేగంవల్లే 7,500 కంటే ఎక్కువ ప్రమాదాలు జరగ్గా సుమారు 2,760 మంది మృత్యువాతపడ్డారు. వీటితోపాటు హిట్ అండ్ రన్ కేసులు, వాహనాలను వెనుక నుంచి లేదా పక్క నుంచి ఢీకొట్టడం వంటి ఘటనలు కూడా వేలాది మంది మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరగడంపై రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. గతంలో నమోదుకాని చిన్నచిన్న ప్రమాదాలను కూడా ప్రస్తుతం రికార్డు చేస్తుండటం వల్లే గణాంకాలలో ఈ పెరుగుదల కనిపిస్తోందని వారు చెబుతున్నారు. రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ఇప్పటికే జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా రోడ్ల ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దడం, నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం, ప్రమాద సమయాల్లో తక్షణ అత్యవసర స్పందన వంటి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ

మొదటి తరువాయి

మంది ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు ఇవ్వడంతో ఆయననే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అయితే, తాము సూచించిన ఎమ్మెల్యేను కాకుండా.. స్పీకర్ తిరుగుబాటు ఎమ్మెల్యేను అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించడాన్ని సవాలు చేస్తూ మమతా బెనర్జీ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాజాగా జస్టిస్ క్రిష్ణా రావ్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. అసెంబ్లీ స్పీకర్ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని, ఇప్పటికిప్పుడు ప్రతిపక్ష నేతగా రితబ్రతను మార్చలేమని కోర్టు తెలిపింది. ఈ అంశంపై స్పందించాలని స్పీకర్‌తోపాటు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంలో తమ స్పందన తెలియజేయాలని కోరింది. దీనిపై స్పందించిన ప్రతివాదులు.. తాము అఫిడవిట్ సమర్పించేందుకు మూడు వారాల గడువు కావాలని కోరారు. అయితే, కోర్టు రెండు వారాల సమయం ఇచ్చింది. అలాగే, తదుపరి విచారణ జూలై 28కి వాయిదా వేసింది. అప్పటివరకు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా రితబ్రతా బెనర్జీనే కొనసాగుతారని స్పష్టం చేసింది.

# కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్..!

మొదటి తరువాయి

ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెల్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ఎ÷–లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది.

# యూఏఈలో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం..!

మొదటి తరువాయి

12 నెలల గడువు విధించింది. దశల వారీగా ఈ రూల్స్‌ను అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపింది. 2024 నాటి గణాంకాల ప్రకారం.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పిల్లలు సగటున రోజుకు 3 గంటలపాటు సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నారని సర్వేల్లో తేలింది. చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణ తీసుకొచ్చిన తొలి దేశంగా ఆస్ట్రేలియా నిలిచింది. ఆ తర్వాత యూకే, మలేసియా లాంటి దేశాలు కూడా ఈ తరహా నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చాయి.

# అమెరికాపై విజయం సాధించాం

-ప్రకటించిన ఇరాన్
-ఫ్రాన్స్‌లో ట్రంప్-పెజెష్కియాన్ ఒప్పందం
-ట్రంప్ సంతకమే అమెరికా లొంగుబాటుకు సాక్ష్యం
-హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌దే సర్వాధికారం
-ఇజ్రాయెల్ దాడులు ఆపకుంటే ఉల్లంఘనే!
-తుది నిర్ణయానికి 60 రోజుల గడువు

**టెహ్రాన్:**
ఇరాన్‌తో యుద్ధానికి ముగింపు పలుకుతూ ఫ్రాన్స్‌లో జరిగిన కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓ ఒప్పందంపై సంతకం చేసిన విషయం తెలిసిందే. 14 పాయింట్ల డాక్యుమెంట్‌పై ట్రంప్‌తో పాటు ఇరానీ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ డిజిటల్ సంతకాలు చేశారు. అయితే ఆ ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చినట్లు పాకిస్థానీ మీడియేటర్లు వెల్లడించారు. ఇక ట్రంప్ సంతకం చేసిన ఆ ఒప్పందంపై ఇరాన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాపై తాము దౌత్యపరమైన విజయాన్ని సాధించామని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. అమెరికా తన మిలిటరీ లక్ష్యాలను అందుకోలేకపోయిందని ఆ అధికారులు ఆరోపించారు. ఇరానీ పార్లమెంటరీ స్పీకర్,



అమెరికాతో చర్చల్లో పాల్గొన్న మొహమ్మద్ ఘలీబాఫ్(వీశీష్ట్రుఎమ్ఖుఎ +ష్ట్రుశ్రీఅమ్ఖుట) మాట్లాడుతూ.. అమెరికా లొంగిపోయిందని చెప్పడానికి ట్రంప్ చేసిన ఒప్పంద సంతకమే సాక్ష్యమని తెలిపారు. ఆ అగ్రిమెంట్ అనేది అమెరికా వైఫల్యానికి ఆధారామన్నారు. ఇరానీ టీవీలకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఘలీబాఫ్ మాట్లాడుతూ.. ప్రజలు ఆ అగ్రిమెంట్‌ను పరిశీలించి, దానిపై నిర్ణయాన్ని అంచనా వేస్తారన్నారు. హోర్ముజ్ జలసంధి మళ్లీ సాధారణ పరిస్థితులకు రాదు అని గట్టిగా చెబుతున్నానని ఘలీబాఫ్ అన్నారు. హోర్ముజ్‌పై సార్వభౌమాధికారం ఇరాన్‌కు ఉందని ఆయన అన్నారు. తాము చేసే సేవలకు ఫీజు తీసుకుంటామని కూడా ఘలీబాఫ్ అన్నారు. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ భాగేహి మాట్లాడుతూ హోర్ముజ్ జలసంధి పునరుద్ధరణ కోసం నియమావళిని రూపొందిస్తామన్నారు. దీని కోసం ఒప్పందంలో భాగంగా ఒమన్‌తో చర్చలు జరుపుతామన్నారు. ఒకవేళ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపకుంటే, అప్పుడు ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లుగా భావిస్తామన్నారు. వాస్తవానికి ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం సంతకం .. తుది ఒప్పందం కాదు. ఆ రెండు దేశాల మధ్య ఉన్న వివిధ అంశాలపై చర్చించేందుకు మరో 60 రోజుల పాటు గడువు ఇవ్వనున్నారు. ఇరాన్ అణ్వాయుధాలు, ఆంక్షల సడలింపు, ఆస్తులను రిలీజ్ చేయడం, హోర్ముజ్ భవిష్యత్తుపై రాబోయే 60 రోజుల్లో నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆ తర్వాత ఆ ఒప్పందానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదం ఇస్తుంది. అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ కనుసన్నల్లోనే అణ్వస్త్రాలను నిర్వీర్యం చేయనున్నారు.

# ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

మొదటి తరువాయి

వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి తరువాయి

పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా, 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కోరగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఉన్నారు.

# వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

మొదటి తరువాయి

కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్టాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# బంగాళాఖాతంలోకి పాకిస్థాన్ సబ్‌మెరైన్..!

మొదటి తరువాయి

1971 యుద్ధంలో భారత్ చేతిలో ఘోర పరాజయం తర్వాత బంగాళాఖాతంలో పాకిస్థాన్ సైనిక ఉనికి పూర్తిగా లేకుండా పోయింది. అయితే చైనాలో తయారైన మొదటి హ్యాంగర్ జలాంతర్గామి గత వారం కరాచీ నౌకాదళ స్థావరానికి చేరుకోవడంతో.. దాని సాయంతో హిందూ మహాసముద్రంలో తమ పరిధిని విస్తరించుకోవచ్చని పాక్ భావిస్తున్నది.శ్రీలంకలోని కొలంబో ఓడరేవుకు వచ్చిన ఒక పాకిస్థాన్ యుద్ధ నౌక వేదికగా అక్కడి కమాండర్ ఒమర్ ఫారూఖ్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనాతో కుదుర్చుకున్న భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా పాకిస్థాన్ మొత్తం ఎనిమిది హ్యాంగర్ క్లాస్ జలాంతర్గాములను కొనుగోలు చేస్తోంది. వీటిలో నాలుగు చైనాలో తయారు కానుండగా.. మిగిలిన నాలుగింటిని కరాచీలోనే నిర్మిస్తారు. ఈ జలాంతర్గాములలో శత్రువుల రాడార్లకు చిక్కకుండా ఎక్కువ రోజులపాటు సముద్రం లోపలే మునిగి ఉండేలా గాలితో సంబంధం లేని అత్యాధునిక చోదక సాంకేతికతను ఉపయోగించారు. ఇవి తమ నౌకాదళ బలాన్ని పూర్తిగా మార్చేస్తాయని పాకిస్థాన్ అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. బంగాళాఖాతంలో విశాఖపట్నం వేదికగా ఉన్న భారత తూర్పు నౌకాదళ స్థావరానికి, ప్రధాన వాణిజ్య సముద్ర మార్గాలకు ఈ పరిణామం సవాలుగా మారే ప్రమాదం ఉంది. పైగా ఇటీవల బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు, వాణిజ్యం, సైనిక బంధాలు బలపడటం కూడా ఈ వ్యూహానికి కలిసి వస్తోంది. అయితే భారత్ ఇప్పటికే బంగాళాఖాతంలో అణు జలాంతర్గాములు, విమాన వాహక నౌకలతో అత్యంత శక్తిమంతమైన ఉనికిని కలిగి ఉంది. అండమాన్ నికోబార్ దీవులలో కూడా భారత్ తన రక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకుంటూనే ఉంది.

# దోచుకోవడం బీఆర్ఎస్ పేటెంట్ హక్కు

మొదటి తరువాయి

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ సంక్షేమ శాఖలో రూ.2వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్‌రావు ఆరోపిస్తే ఆ శాఖ మంత్రిగా జవాబు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని మంత్రి అన్నారు. సంక్షేమ శాఖకు సంబంధించి విద్యార్థులకు కావాల్సిన వస్తువుల కొనుగోలుకు రూ. 683 కోట్లతో టెండర్లు పిలిచామని, రూ. 500 కోట్లతో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ల ఖరారు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు. మొత్తం రూ. 1183 కోట్లకు టెండర్లు పిలిస్తే మాజీ మంత్రి హరీశ్‌రావు రూ. 2వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తే ఆశాఖ మంత్రిగా జవాబు చెప్పానని వివరించారు. 'తాను జవాబు చెప్పితే దొరగారి మెప్పు కోసం కొప్పుల ఈశ్వర్ ఖబ్దార్ అని మాట్లాడుతున్నారని' ఎద్దేవా చేశారు.

# సింగరేణి సంస్థ లో ఉచిత మాస్టర్ల దందా రోజు రోజు కి విపరీతంగా పెరిగిపోతుంది

**- సింగరేణి సంస్థ రామగుండం RG -1 డివిజన్ పరిధిలో ఒకానొక భూగర్భ గనిలో**






**జూన్ సామాజిక తెలంగాణ గోదావరిఖని న్యూస్**
సింగరేణి సంస్థలో కార్మికులు అంతా ఒకే కుటుంబణ అనే లక్ష్యంతో పనిచేస్తున్న సమస్తలో కార్మికులు వేరే కార్మిక నాయకులు వేరు అనే పద్ధతి నెలకొన్నది దీనికి నిదర్శనం ఉచిత మస్తర్ దందా రోజురోజుకి పెరిగిపోతుందని కార్మిక నాయకులు కార్మికులు వారి యొక్క మనోభావాలు వ్యక్తపరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ కి ఇద్దరూ ఐఏఎస్ అధికారులని నియమించిన కూడా ఈ ఉచిత మాస్టర్ దందా కొందరు సూపర్వైజర్ల ( ఓవర్ మెన్ ) పర్యవేక్షణలో జరుగుతున్న దందా కూడా స్థానికంగా ఉన్నటువంటి అధికారులు చూసి చూసినట్టుగా వ్యవహరిస్తున్నారని ఉచిత మాస్టర్ ఇవ్వకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నా కూడా స్థానిక యాజమాన్యం పట్టించుకోకుండా ఉచిత మస్టర్ పడిపోయేవారికి బ్రహ్మరథం పడుతూ వంతన పలుకుతున్నారని ఈ విధంగా జరుగుతే భవిష్యత్తులో సంస్థ ఇంకా నష్టాలుపలు అయ్యే అవకాశం ఉందని మస్టర్ పడి మరికొందరు బెదిరింపులకు తయారవుతారని ఈ యొక్క విధానాన్ని అరికట్టి సంస్థని కాపాడాలని కొందరు కార్మికులు తెలియపరిచినారు. సంస్థను కాపాడవలసిన అధికారులు కిందిస్థాయి సూపర్వైజర్ల ( ఓవర్ మెన్ ) పనితీరు ఒంటెద్దు పోకడలను ఎప్పటికప్పుడు అరికట్టకపోతే సంస్థకు నష్టం చేసిన వారు అవుతారని అలాగే ఆ యొక్క గనిలో ఘర్షణలు కూడా జరిగే అవకాశలు ఏర్పడతాయని కార్మికులు కార్మిక నాయకులు వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉచిత మాస్టర్ పడిపోయే వారిపై ఉక్కు పాదం మోపక పోతే సింగరే ణి సంస్థ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని సంస్థ నష్టాల్లోకి పోవటం ఖాయమని వారు నిరసన వ్యక్త పరుస్తున్నారు . ఈ విషయంపై కొందరు సూపర్వైజర్ల ( ఓవర్ మెన్ ) ల పనితీరు పై కార్పొరేట్ స్థాయిలో విజిలెన్స్ విచారణ జరిపి ఉన్నత అధికారులు కూడా తగు చర్యలు తీసుకోవాలని సంస్థలను కాపాడాలని కార్మిక వర్గం తెలియజేస్తున్నారు.

# పోలాడి హారిక శ్రీనివాసరావు పుణ్యం దంపతుల పెళ్లిరోజులు పురస్కరించుకొని ఆశ్రమంలోని పిల్లలకు భోజన పండ్లు కార్యక్రమం



**జూన్ సామాజిక తెలంగాణ గోదావరిఖని న్యూస్**
టీబీజీకేఎస్ యూనియన్ నాయకుడు పోలాడి శ్రీనివాసరావు, హారిక దంపతుల పెళ్లిరోజు సందర్భంగా రామగుండంలోని తబిత ఆశ్రమంలో ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని పిల్లలకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు దంపతులు తమ ఆనందాన్ని ఆశ్రమంలోని చిన్నారులతో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఆశ్రమ నిర్వాహకులు పోలాడి శ్రీనివాసరావు దంపతులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పిల్లల సంక్షేమం కోసం అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది, యూనియన్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొని దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమం ఆశ్రమంలోని పిల్లల్లో ఆనందాన్ని నింపగా, హాజరైన వారందరూ దంపతుల సేవా భావాన్ని ప్రశంసించారు.

# సర్ ను రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లు బి ఎల్ ఓ లకు సహకరించాలి

**-ఆర్మూర్ ఎమ్మార్వో సత్యనారాయణ..**




**ఆర్మూర్,జూన్ 18 (సామాజిక తెలంగాణ):**
ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన సర్ ను రాజకీయ పార్టీల భూత్ ఏజెంట్లు బిఎల్ఓలకు సహకరించాలని తహసిల్దార్ సత్యనారాయణ చెప్పారు. ఆర్మూర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గల రైతు వేదికలో గురువారం రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లతో ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) పై శిక్షణ సదస్సును నిర్వహించారు. తహసిల్దార్ పాల్గొని మాట్లాడుతూ ఈనెల 25 నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు బూత్ స్థాయిలో బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేటర్ ఫారాలను ఇస్తారన్నారు. ఈ ఫారాలను భర్తీ చేసి తిరిగి ఇవ్వవలసి ఉంటుందని వివరించారు. ఎన్యూమరేటర్ పారాలను బిఎల్ఓలకు ఇవ్వనట్లయితే పేర్లు తొలగిపోతాయని చెప్పారు. రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లు గణన దశ ఫారాలను సక్రమంగా నింపి బిఎల్ఓలకు ఇవ్వడానికి సహకరించాలని సూచించారు. బాధ్యతగా భావించి కుటుంబాల వివరాలుతో పాటు ఫారంలో పేర్కొన్న వివరాలను సక్రమంగా నింపి ఇవ్వాలన్నారు. ఆర్మూర్ పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలలో అర్హులైన ఓటర్ల జాబితా తయారు చేయడానికి సహకరించాలన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లకు బిఎల్వోలు, అధికారుల నుంచి సహకారం లభిస్తుందన్నారు. ఈ ఇంటింటి సర్వేలో మృతి చెందిన వారి పేర్లను సేకరించి తొలగిస్తారన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో బిఎల్వోలు, బిఎల్ఎస్ లతో సమావేశం జరిగింది. ఈ శిక్షణలో ఎన్నికల నాయబ్ తహసిల్దార్ ప్రవీణ్, ట్రైనర్ అశోక్,పిప్రీ సర్పంచ్ బందెల కిరణ్,మాజీ ఎంపీటీసీ సభ్యుడు సామేర సురేష్,కౌన్సిలర్లు పోచంపాడు శ్రీనివాస్,పాన్ శ్రీనివాస్ ,పృథ్వీరాజ్, నదీమ్, నయీమ్ ,అజీమ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోల్కం వేణు,బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, నాయకులు తైసీన్, సుంకరి రవి,మహేష్,దొండి శ్యామ్,జీవి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మొగుడంపల్లి మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పవన్ రాథోడ్



**జహీరాబాద్ సామాజిక తెలంగాణ ప్రతినిధి జూన్ 18**
జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పవన్ రాథోడ్ ఎన్నికయ్యారు. పూర్వము ఈయన తండ్రి మాణిక్ రావు చేసిన సేవలను గుర్తించి ఈ పదవిని కుమారునికి కట్టబెట్టారు. ఈయనపై హై కమాండ్ దృష్టిసారించి మండల పార్టీ అధ్యక్షులుగా నియమించడం జరిగింది. అందుకుగాను పవన్ రాథోడ్ రాష్ట్ర నాయకత్వానికి జహీరాబాద్ నియోజకవర్గ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన ఎమ్మార్వో హసీనా బేగం ను కలిసిన మైనారిటీ జిల్లా నాయకులు ఖాజా ఖాన్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్



**సంగారెడ్డి జిల్లా 18, జూన్ ( సామాజిక తెలంగాణ ).**
కంది మండల నూతన తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన హసీనా బేగం ను మైనారిటీ జిల్లా నాయకులు ఖాజా ఖాన్,కంది గ్రామ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ తో కలిసి ఆమెకు బొకే ఇస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఖాజా ఖాన్ మాట్లాడుతూ మైనారిటీ తరపున పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. అలాగే లక్ష్మీ నగర్ వాసులకు ముస్లింలకు, హిందువులకు మరియు క్రిస్టియన్లకు శ్మశాన వాటిక కోసం భూమిని కేటాయించాలని ఎమ్మార్వోను ఆయన కోరారు. సానుకూలంగా స్పందించిన నూతన ఎమ్మార్వో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు కరీం ఖాన్, జుల్కల్ గ్రామ మాజీ ఎంపిటిసి ఎండి. హైదర్ అలీ, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు రిజ్వాన్ ఖురేషి, నాయకులు నవాజ్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యంగా విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలి

**-మండల విద్యాశాఖ అధికారి**
**-మానుపాటి పాపమ్మ.**



**సామాజిక తెలంగాణ**
చెన్నరావుపేట మండలం.
ఈరోజు మండలం లోని పలు పాఠశాలలో బడిబాట కార్యక్రమం లో భాగంగా దివ్యంగా విద్యార్థుల భవిష్యత్ కార్యక్రమం లు నిర్వహించడం జరిగింది. ఈరోజు జల్లి హైస్కూల్ మరియు బాపునగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో దివ్యంగా విద్యార్థుల భవిష్యత్ కార్యక్రమం లలో మండల విద్యాశాఖ అధికారి. ముఖ్య అతిథిగా హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఏం. ఈ. ఓ . మాట్లాడుతూ జల్లి హైస్కూల్ యందు ఉన్న భవిత కేంద్రం ను తల్లిదండ్రులు వినియోగించుకొని దివ్యంగా విద్యార్థులను ఈ భవిత కేంద్రం నకు పంపించాలి అని తెలిపారు. అలాగే దివ్యంగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం,రవాణా భత్యం, స్కాలర్షిప్, ఇంటి వద్ద విద్య, అలింకో సహకారం ద్వారా ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ఉపకరణాలు మరియు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ,స్పీచ్ థెరపీ,ఫిజియో థెరపీ తదితర సౌకర్యాలను ప్రభుత్వం ఉచితంగా దివ్యంగా విద్యార్థులకు అందిస్తుంది. దివ్యంగా విద్యార్థులకు కేటాయించిన భవిత కేంద్రం నకు అనుభవజ్ఞులు అయిన ఇక్లుజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ ను కేటాయించడం జరిగింది. కావున దివ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశం ను వినియోగించుకోవాలని కోరడం జరిగింది. అలాగే ఈరోజు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన దివ్యంగా విద్యార్థుల ఉపకరణాలను ఏం. ఈ. ఓ. గారి చేతుల మీదుగా విద్యార్థులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ పెద్ది వెంకటేశ్వరరావు మరియు ఐ. ఈ. ఆర్. పి. చిన్నపాక రాము ఉపాధ్యాయులు సరిత, అనిత, శైలజా, బిక్షపతి, లక్ష్మయ్య, అశోక్,సుభాష్, ఈర్యా,కుమారస్వామి, రత్న సింధూర్ ,సుమత మరియు సీఆర్పీ లు శిల్ప,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు



**సామాజిక తెలంగాణ.**
**చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామం**
ఇందిరమ్మ గృహ ప్రవేశానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు..లింగగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కోడారి మౌనిక –రాజు దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ మండల ప్రచార కార్యదర్శి మాదారపు చరణ్ కుమార్ గ్రామ పార్టీ అధ్యక్షులు మంద సోమయ్య,మాజీ సర్పంచ్ లు గణేష్ భాస్కర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న రాజు మాజీ ఎంపీటీసి బూడిద వెంకటేశ్వర్లు వార్డ్ సభ్యులు తాడెం ప్రభాకర్ మల్లం సాగర్ సీనియర్ నాయకులు చిందం కుమార్ పెద్ద రాజు ఉపాధ్యక్షులు కుక్కల కుమార్ కూరపాటి సదయ్య బూడిద కుమారస్వామి మల్లం వేణు పులి రాములు కొడారి సతీష్ తదితరులు పాల్గొన్నారు..

# మహబూబాబాద్ డంపింగ్ యార్డ్‌లో మొక్కలు నాటిన చైర్‌పర్సన్, కమిషనర్



**మహబూబాద్: జూన్ 18**
75వ వన మహోత్సవం సందర్భంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి రమేష్, కమిషనర్ ముడావత్ వినోద్ కుమార్ పాల్గొని స్వయంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతిని పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచడం అందరి బాధ్యతని, నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సల్వాది దిలీప్, చేనేత ఐక్యవేదిక యువజన ప్రెసిడెంట్ దిద్ది సాత్విక్ కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాదరబోయిన విజయ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# యాప్‌తో యూరియా పంపిణీ సులభం



**జగిత్యాల సామజిక తెలంగాణ జిల్లా ప్రతినిధి**
ఇబ్రహీంపట్నం మండలంలో యూరియా బుకింగ్ యాప్ విజయవంతంగా అమలవుతూ రైతులకు సులభమైన, పారదర్శకమైన యూరియా పంపిణీ వ్యవస్థను అందిస్తోంది. రైతులు ఇంటి నుంచే లేదా వ్యవసాయ శాఖ సిబ్బంది, డీలర్లు, సహకార సంఘాల సిబ్బంది సహాయంతో యాప్‌లో యూరియాను బుక్ చేసుకుని, తమకు కేటాయించిన బుకింగ్ నంబర్ ద్వారా ఎంపిక చేసుకున్న డీలర్ కేంద్రంలో యూరియాను పొందుతున్నారు.మండలంలో ఇప్పటివరకు 1,547 మంది రైతులు యాప్ ద్వారా నమోదు చేసుకుని 1,549 బుకింగ్స్ చేశారు. ఈ బుకింగ్స్ ద్వారా మొత్తం 4,872 యూరియా సంచులు బుక్ చేయబడగా, ఇప్పటికే 3,073 సంచులు రైతులకు విక్రయించబడ్డాయి.ప్రస్తుతం మండలంలో 8,200 యూరియా సంచులు అందుబాటులో ఉండగా, రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా కొనసాగుతోంది. యాప్ ద్వారా యూరియా పంపిణీ సజావుగా సాగుతుండటంతో రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.యూరియా అవసరమున్న రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ కోరారు.

## వెంకట్ సాయి మోటార్స్ అధినేతగడల యాదగిరి జన్మదిన శుభాకాంక్షలు ఘనంగా నిర్వహించారు



**యాచారం సామాజిక తెలంగాణ న్యూస్ జూన్ 18**
యాచారం మండలం మాల్ గ్రామానికి చెందిన వెంకట్ సాయి మోటార్స్ అధినేత గడల యాదగిరి జన్మదిన శుభాకాంక్షలు ఘనంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భాస్కర్ నాయక్ యాచారం మండల కమిటీ సభ్యుడు  మంతన్ గౌరెల్లి గ్రామ శాఖ డి వై ఎఫ్ ఐఅధ్యక్షుడు  జంగయ్య యాదవ్ రంగారెడ్డి జిల్లా రజాకా కోశాధికారి కప్పాటి వెంకటేష్ పబ్బతి ఆంజనేయ స్వామి టెంపుల్అర్చకులు దంటు సుబ్రహ్మాణ్య శర్మ చందు నాయక్ మల్లేష్ దేవరకొండ పుష్ప రత్నం మాల్ మార్కెట్ బిజినెస్ నేత మధు శెట్టి ఎస్ టెన్ న్యూస్ సామాజిక తెలంగాణ డివిజన్ ఇంచార్జ్ గడల సురేష్ తదితరులు పాల్గొన్నారు

## హైకోర్టులో మద్దిశెట్టికి ఊరట పోలీసు రక్షణ కల్పించాలని మధ్యంతర ఉత్తర్వులు



**సామాజిక తెలంగాణ జూన్ 18 సరోజనాపురం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం సరోజనాపురం2015 పోడు భూముల కేసులో మణుగూరు కోర్టుకు హాజరవుతున్న సందర్భంగా తనపై జరిగిన దాడి ఘటనపై ఎన్సీపీ పార్టీ -- ఎన్డీఏ మహాకూటమి జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు (ఎన్వైసీ), ఆంధ్రప్రదేశ్ ఒ ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జి డా. మద్దిశెట్టి సామేలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. మద్దిశెట్టి తరపున హైకోర్టు న్యాయవాది  కిరణ్ కుమార్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న గౌరవ హైకోర్టు, కింది కోర్టులో ఉన్న కేసు పూర్తయ్యే వరకు మద్దిశెట్టి సామేలుకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని పోలీస్ శాఖకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మణుగూరు కోర్టు వాయిదాలకు హాజరవుతున్న సమయంలో స్థానికంగా ఉన్న కొల్లిపాక నరసింహారావు మరియు మరికొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా దాడి చేశారని పేర్కొంటూ మద్దిశెట్టి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులతో న్యాయం పట్ల తనకు మరింత విశ్వాసం పెరిగిందని అదే విధంగా హై కోర్టు న్యాయమూర్తికి మరియు అడ్వకేట్ కిరణ్ కి మద్దిశెట్టి సామేలు ధన్యవాదాలు తెలిపారు. ఎన్సీపీ పార్టీ  ఎన్డీఏ మహాకూటమి (ఎన్వైసీ) తెలంగాణ రాష్ట్ర మీడియా సెల్‌లి

# మీనాక్షి నటరాజన్  జరిగిన అన్యాయం యావత్ భారత ప్రజాస్వామ్యానికి, భారత రాజ్యాంగానికి జరిగిన అన్యాయం- డా. వెంకటేశ్ చౌహాన్




**బషీర్ బాగ్, జూన్ 18 (సామాజిక తెలంగాణ): గాంధీ భవన్:**
స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను పరిరక్షించాలని, దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరుతూ గాంధీ భవన్‌లో నిర్వహించిన చరఖా సత్యాగ్రహం కార్యక్రమంలో డా. వెంకటేశ్ చౌహాన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీనాక్షి నటరాజన్  జరిగిన అన్యాయం కేవలం ఒక నాయకురాలికి జరిగిన అన్యాయం కాదని, అది యావత్ భారత ప్రజాస్వామ్యానికి, భారత రాజ్యాంగానికి జరిగిన అన్యాయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి, ప్రతి రాజకీయ నాయకుడికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, కానీ ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.దేశంలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన సమయంలో మహిళా నాయకులను అణచివేసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును గౌరవించకుండా అధికారాన్ని కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేయడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. అదేవిధంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలను ఆయన తీవ్రంగా ఖండించారు. దేశ ప్రజల సొత్తుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకరించే విధానాలు ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయని, వాటిని బలహీనపరచడం ద్వారా లక్షలాది మంది యువత ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత, మధ్యతరగతి ప్రజల సమస్యలను పక్కనపెట్టి కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేయడం దేశ భవిష్యత్తుకు హానికరమని హెచ్చరించారు.ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సామాజిక న్యాయం మరియు ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని డా. వెంకటేశ్ చౌహాన్ స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కును, ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడేందుకు ప్రతి పౌరుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరియు ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్న పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ ముజీబ్ ను సన్మానించిన టీఎన్జీవోస్  నేత రాజ్ కుమార్



**బషీర్ బాగ్, జూన్ 18 (సామాజిక తెలంగాణ) :** హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ ఎస్. యాదయ్య ఆదేశాల మేరకు పలువురు ఆఫీస్ సబార్డినేట్ (ఓఎస్) సిబ్బందికి జూనియర్ అసిస్టెంట్ (జేఆర్ అసిస్టెంట్) హోదాలో పదోన్నతులు కల్పించారు.పదోన్నతి పొందిన వారిలో శ్రీ డి. వసంత్‌ను జి హెచ్ ఎస్ రాజ్‌భవన్‌కు, శ్రీ కుట్టం రాజును డైట్ నేరెడ్‌మెట్‌కు, సీతారాంను జి హెచ్ ఎస్ ఎర్రమంజిల్‌కు, రాజును జి హెచ్ ఎస్ మంగళ ఘాట్‌కు, ఐజాజ్‌ను జి.హెచ్.ఎస్ దారుల్‌షిఫాకు, సాయిని జి హెచ్ ఎస్ అంబర్‌పేట్‌కు జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో అబ్జార్బ్ అయిన వారిలో ఉమాపతి సింగ్‌ను జి జి హెచ్ ఎస్ వై మైసారంకు, శ రోహిత్‌ను డైట్ నేరెడ్‌మెట్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఈ పదోన్నతి ఫైల్‌ను ఏడీ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ జి. రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు ఖాజా సోహైల్ అహ్మద్, ఫైయాజ్ అహ్మద్ సమర్థవంతంగా ప్రాసెస్ చేశారు.ఈ సందర్భంగా పదోన్నతుల కోసం విశేషంగా కృషి చేసిన టీఎన్జీవోస్ యూనియన్ సెంట్రల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ ను టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్‌కుమార్  శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో  సెక్రెటరీ ఎం. భాస్కర్, ఉపాధ్యక్షుడు రుగేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫిరోజ్ అహ్మద్, పబ్లిక్ సెక్రటరీ రవి, ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**దౌల్తాబాద్, జూన్ 18 (సామజిక తెలంగాణ )**
దౌల్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ఇళ్లను ప్రారంభించారు. మండలంలోని చెట్ల నర్సంపల్లి, ఇందుప్రియల్, సూరంపల్లి గ్రామాల్లో లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చెట్ల నర్సంపల్లిలో దుబాసి రాజమణి-వెంకటయ్య, ఇందుప్రియల్‌లో గుంటి గంగోత్రి-శ్రీనివాస్, సూరంపల్లిలో బండి నవనీత-ఇలియాజర్ కుటుంబాలు తమ కొత్త ఇళ్లలోకి గృహప్రవేశం చేశారు.ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పడాల రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, పలు గ్రామాల సర్పంచులు నాగరాజు, లాలు,దాస్, ముచ్చుమర్రి అనురాధ రమేష్,ఆత్మ కమిటీ డైరెక్టర్ సూరంపల్లి ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సంపత్ రెడ్డి,మల్లేశం, లలిత కృష్ణ,ఖాసీం, దౌల్తాబాద్ ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ,కాంగ్రెస్ నాయకులు దొమ్మాట స్వామి, లక్ష్మణ్,తలారి నరసింహులు,దుబాషి భాస్కర్, చిందం లక్ష్మణ్, ముత్యాల నర్సింలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెస్ట్ సర్వీస్ అవార్డుకి ధనావత్ శివ ఎంపిక



**సామాజిక తెలంగాణ న్యూస్  చిన్న శంకరంపేట్ జూన్ 19**
ఖాజాపూర్ తండాకు చెందిన ప్రముఖ యువ సామాజిక సేవకుడు, సానీక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ధనావత్ శివ బెస్ట్ సర్వీస్ అవార్డు 2026 కు ఎంపికయ్యారు మాతృదేవో భవ పితృదేవో భవ సొసైటీ 7వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును జూన్ 21, ఆదివారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించే కార్యక్రమంలో అందజేయనున్నారు. ధనావత్ శివ గ్రామీణ ప్రాంతాల్లో విద్య, యువత సాధికారత, ఉపాధి అవకాశాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల ద్వారా విశేష సేవలు అందిస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ధనావత్ శివ మాట్లాడుతూ, ఈ అవార్డు తన ఒక్కరికే కాకుండా తన సేవా ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ చెందుతుందని అన్నారు. భవిష్యత్తులో మరింత బాధ్యతతో సమాజ సేవ కొనసాగిస్తానని తెలిపారు.

# శాలిగౌరారం మండలంలో వెలుగులోకి లంచగొండి అధికారి బాగోతం

**-లంచం ఇస్తేనే ఫైలు ముందుకు,లేదంటే పెండింగ్**



**శాలిగౌరారం, జూన్ 18,(సామాజిక తెలంగాణ):** ప్రజలకు సేవ చేయాల్సిన
ప్రభుత్వ యంత్రాంగంలోని కొందరు అధికారులు అవినీతికి అడ్డాగా మారుతున్నారనే ఆరోపణలకు శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో జరిగిన ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.సాదా బైనామా చేయించుకోవడానికి వచ్చిన ఓ మహిళా రైతు నుంచి రూ.22 వేల లంచం డిమాండ్ చేసినట్లు గ్రామ జీపీఓ అధికారిపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియో రికార్డింగ్ వెలుగులోకి రావడంతో అధికార వర్గాల్లో కలకలం రేగింది.చిత్తలూరు గ్రామానికి చెందిన రైతు సునీత తనకు చెందిన రెండు ఎకరాల రెండు గుంటల భూమికి సాదా బైనామా ప్రక్రియ చేపట్టేందుకు గ్రామ జీపీఓ అధికారి రజితను ఆశ్రయించింది.అయితే నిబంధనల పేరుతో మొదట పని సాధ్యం కాదని చెప్పిన అధికారి, అనంతరం రూ.22 వేల రూపాయలు ఇస్తే పని పూర్తవుతుందని బేరసారాలకు దిగినట్లు బాధితురాలు ఆరోపించింది.ఈ సందర్భంగా జరిగిన సంభాషణను సునీత రహస్యంగా వీడియోలో రికార్డు చేసింది.వీడియోలో కార్యాలయంలోని ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్,తహసీల్దార్ స్థాయి అధికారులకు కూడా డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని జీపీఓ అధికారి చెప్పినట్లు స్పష్టంగా వినిపిస్తుంది.లంచం ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించిన మహిళకు ,డబ్బులు ఇస్తేనే ఫైల్ కదులుతుంది.. లేకపోతే పెండింగ్‌లో పడేస్తాం అంటూ హెచ్చరించినట్లు బాధితురాలు ఆరోపించింది. ముందస్తుగా రూ.2 వేల నగదు ఇచ్చిన సమయంలోనే వీడియో రికార్డు చేసినట్లు ఆమె తెలిపింది.అధికారుల వేధింపులతో విసిగిపోయిన సునీత,తన వద్ద ఉన్న వీడియో ఆధారాలను మీడియాకు అందజేసింది.దీంతో ఈ వ్యవహారం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనపై తహసీల్దార్‌ను వివరణ కోరగా, విషయంపై నివేదిక సిద్ధం చేస్తున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రాణి ఝాన్సీ లక్ష్మీబాయి168వ వర్ధంతి



**మందమర్రి జూన్ 18: (సామాజిక తెలంగాణ):** ప్రధమ స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి ఝాన్సీలక్ష్మీబాయి168వ వర్ధంతిని రిటైర్డ్ ఆర్మీ జవాన్ ప్రస్తుత సింగరేణి ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పివ్ హాల్,రాణి పివ్ హాల్ దంపతుల ఆధ్వర్యంలో గురువారం రాణి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతిని నిర్వహించారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. పురుషోత్తం మాట్లాడుతూ.. ఝాన్సీ లక్ష్మీబాయి1828 వారణాసిలో మణికర్ణికా తంబేగా జన్మించారు.ఆమె భారత స్వాతంత్ర సంగ్రామ పోరాటంలో ముఖ్యమైన నాయకురాలని,చిన్ననం నుంచి గుర్రపు స్వారీ కత్తి యుద్ధం నేర్చుకుని1857 బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన భారత తిరుగుబాటులో ఆమె కీలక పాత్ర పోషించి ఆమె ధైర్యానికి దేశభక్తికి ప్రతికగా నిలిచారు. ఝాన్సీరాణి చిన్నతనం నుండి దేశ స్వాతంత్రం కోసం పోరాడి 1858 జూన్ లో వీరమరణం పొందారు.భారత దేశ చరిత్రలో ఒక వీరవనితగా స్వాతంత్ర సమరయోధురాలిగా గౌరవించబడిందని ఆమె ధైర్యం దృడ సంకల్పం నేటికీ అనేక మందికి ప్రేరణ నిస్తాయని,విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి దేశభక్తిని పెంపొందించుకోవడంతో పాటు స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవలసిన అవసరం ఉందన్నారు. రాజేష్ పివ్ హాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు దేశభక్తి భావాన్ని పెంపొందించే లక్ష్యంతో పాఠశాలలో స్వతంత్ర సమరయోధులు, మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, మరియమ్మ, వాణి,దేవి జయశ్రీ ,కల్పలత, రవీందర్ ,ప్రసాదరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# యోగతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది



**మందమర్రి జూన్ 18: (సామాజిక తెలంగాణ):** యోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని,అనేక రకాల రుగ్మతలను నివారించుకోవచ్చని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సోత్కు సుదర్శన్, డైరెక్టర్ పుస్కూరి నర్సింగరావు చైర్ పర్సన్ పోలు శ్రీనివాస్, అన్నారు. విలేజ్ మందమర్రిలోని రామాలయం సమీపంలో నిర్వహిస్తున్న ఉచిత యోగ శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. నరసింగరావు-- ప్రణతి దంపతుల ఆధ్వర్యంలో, శ్రీమతి మీనాక్షి యోగ, పిరమిడ్ ధ్యాన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగ పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకుని దానిని నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి వ్యాధులను కూడా నియంత్రించు కోవచ్చున్నారు.యోగ శిక్షణ కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో, మందమర్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అదేవిధంగా ఈ శిక్షణలో పాల్గొన్న పిల్లలందరికీ యోగ పట్ల ఆసక్తి చూపాలని కన్సిలేషన్ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్లు కొంపెల్లి లలిత, మీనాక్షి, లైన్స్ క్లబ్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్, తాడికొండ లూథర్ భూపాల్, బింగి రాజన్న,ఆలయ పూజారి,తదితరులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం: మండల విద్యాధికారి గజ్జేల కనకరాజు

**- విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ.**



**దౌల్తాబాద్, జూన్ 18 (సామజిక తెలంగాణ )** ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాల స్థాయిలో విద్యార్థులందరికీ నోటు పుస్తకాలను పంపిణీ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గొడుగుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్, మెహరాజ్ బేగం, గౌరీశంకర్, శ్రీనివాస్, స్వప్న, మౌనిక, సాయికుమార్, మండల వనరుల కేంద్రం సిబ్బంది శేఖర్, పెంటయ్య, మల్లేశం, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

# మరో మారు మానవత్వం చాటుకున్న డాక్టర్ ఆలేటి

**-ఇటీవలే మరణించిన మృతుడి కుటుంబానికి 10 వేల ఆర్థిక సాయం**



**శాలిగౌరారం, జూన్ 18,(సామజిక తెలంగాణ):-** సొంత గడ్డ పై మమకారంతో పాటు కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో పవన్ సాయి హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. మండల పరిధిలోని తుడిమిడి గ్రామానికి చెందిన బట్టు పెద్ద గోపాల్ ఇటీవలే అకాల మరణం చెందారు.పెద్ద గోపాల్ పట్ల మరణం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని,సంతాపాన్ని వ్యక్తం చేశారు.
గురువారం మృతుడి నివాసానికి చేరుకున్న డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. కష్టసమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ,తక్షణ సహాయం నిమిత్తం 10,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో బాకీ వెంకటయ్య,సర్పంచ్ కుంభం రమేష్,గిరి,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సబ్ రిజిస్టర్ షేర్ అలీకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీటీసీ హైదర్, పార్టీ నాయకులు.





**సంగారెడ్డి జిల్లా 18, జూన్ ( సామాజిక తెలంగాణ ).**
సంగారెడ్డి సబ్ రిజిస్టర్ గా షేర్ అలీ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జుల్కల్ గ్రామ మాజీ ఎంపీటీసీ ఎండీ హైదర్ అలీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఖాజా కళ్యాణి, అంజద్, నయీమ్ తో కలిసి సబ్ రిజిస్టర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్ తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## గాజులపల్లి అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు:గాజులపల్లి సర్పంచ్ పంజా స్వామి



**దౌల్తాబాద్, జూన్ 18 (సామజిక తెలంగాణ )** దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామ అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల కింద మంజూరైన నిధులకు గాజులపల్లి సర్పంచ్ పంజా స్వామి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ.10 లక్షలు, కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.5 లక్షలు, బీజేపీ తరఫున రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చడంలో సహకరించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రజాప్రతినిధులు సహకరించడం అభినందనీయమని గ్రామ నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు. గ్రామాభివృద్ధికి అన్ని వర్గాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## ఆర్యవైశ్య మహాసభ నూతన పదవీదారులకు ఘన సన్మానం







దౌల్తాబాద్ జూన్ 18 (సామజిక తెలంగాణ )

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో కీలక పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికైన నాయకులను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మహంకాళి నాగరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గంప శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన నాయకులతో పాటు సిద్ధిపేట అమర్నాథ్ సేవాసమితి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మహంకాళి నవీన్‌లను అభినందించారు. ఈ సందర్భంగా సిద్ధిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షురాలు పబ్బ మాధవి అశోక్ ఆధ్వర్యంలో వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న వీరికి లభించిన ఈ బాధ్యతలు సమాజాభివృద్ధికి మరింత దోహదపడతాయని పేర్కొన్నారు.

## తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన కేటీఆర్ ఎమ్మెల్యే తలసాని



జూన్ 18 బేగంపేట్ (సామాజిక తెలంగాణ)

తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మద్యాహ్న భోజనం కార్యక్రమాన్ని బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. గురువారం బేగంపేట లోని రామానంద తీర్థ స్కూల్ నిర్వాహకులు ఎమ్మెల్సీ స్వర్గీవాని పర్యవేక్షణలో సీల్ వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్, బ్యాగ్స్ ను కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీల్ వెల్ సంస్థ అధినేత సుబ్బారావు ను కేటీఆర్ ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం స్కూల్ లోని 240 మంది విద్యార్థులకు తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని కేటీఆర్ ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని వడ్డించడం పట్ల మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కేటీఆర్ ప్రశంసించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు టి. మహేశ్వరి, నామన శేషుకుమారి, బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఆకుల హరికృష్ణ, వెంకటేషన్ రాజు, నాయకులు శ్రీహరి, మీర్జా ఖలీల్ బేగ్ , నరేందర్, ప్రవీణ్ రెడ్డి, కిషోర్, నాగులు, శేఖర్, ఆరిఫ్, కరుణాకర్ రెడ్డి , పీయూష్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల ఆందోళన




సామాజిక తెలంగాణ దోమ మండలం జూన్18

దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలు గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి తమను అనవసరంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ పెద్ద సంఖ్యలో కూలీలు కార్యాలయం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. కూలీలు మాట్లాడుతూ ఉపాధి పనులకు సంబంధించిన హాజరు నమోదు, వేతనాల చెల్లింపులు పనుల కేటాయింపులో అధికారులు సరైన విధంగా వ్యవహరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా సమస్యలు ఎదురవుతున్నప్పటికీ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి పరిష్కారం చూపలేదని ఆరోపించారు. టెక్నికల్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి కారణంగా ఉపాధి హామీ పనుల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయని తమ కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతోందని కూలీలు తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి వివరణ అడగగా మేము ఎవరిని ఇబ్బంది పెట్టలేదని ఉపాధి పని జరిగే ప్రదేశానికి వెళ్లి వాళ్ళు పని చేస్తున్నారా లేదా అని చూశామని తెలిపారు.

# రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి

**- మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదు కలెక్టర్**
**- యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదు**
**- ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్ మరియు మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదు.**
**- ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం.**
**- రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.**
**- రైతులకు నాణ్యమైన సేవలందించాలి**
**- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
**- పారదర్శక సేవలతో రైతుల విశ్వాసం పొందాలి.**
**- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.**



మెదక్ , జూన్ 18( సామాజిక తెలంగాణ):-

రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలని, జిల్లాలో యూరియా కొరత లేదని, ప్రస్తుతం 6300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలదని రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో యూరియా సరఫరా విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ యూరియా కోసం యాప్ రూపొందించడం జరిగిందని రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకుని సమయానికి అనుగుణంగా డీలర్స్ దగ్గరకు వెళ్లి అవసరానికి అనుగుణంగా యూరియా తీసుకువచ్చన్నారు. యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదని ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్, మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదనీ ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం అని వివరించారు. రైతులు సమన్వయం పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా రైతు సేవ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్‌లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నకిలీ (లేదా) నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.

# పారదర్శకంగా కానిస్టేబుళ్ల బదిలీలు

**- పారదర్శక బదిలీలతో పోలీసు సిబ్బందికి భరోసా...**
**- సీనియారిటీకి ప్రాధాన్యమిస్తూ బదిలీలు.**
**- కౌన్సిలింగ్ ద్వారా 80 మంది కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు.**
**- పారదర్శక బదిలీలే సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాది**
**- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**





మెదక్ , జూన్ 18( సామాజిక తెలంగాణ ):-

మెదక్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 80 మంది కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించారు. ప్రతి కానిస్టేబుల్‌తో ఎస్పీ వ్యక్తిగతంగా మాట్లాడి వారి విల్లింగ్ స్టేషన్లు, జీవిత భాగస్వామి ఉద్యోగ స్థానం (స్పౌస్), సీనియారిటీ, ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డు, పిల్లల విద్య వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పారదర్శకమైన బదిలీల విధానం సిబ్బందిలో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా బాధ్యతాయుతమైన విధుల నిర్వహణకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీసు అధికారిగా నైతిక విలువలు, సేవాభావం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎస్పీ, విధుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. కొత్తగా పోస్టింగ్‌లు పొందిన కానిస్టేబుళ్లు తమ పోలీస్ స్టేషన్ పరిధిలో అంకితభావంతో విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, సూపరింటెండెంట్ వల్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ( ఎస్ఐఆర్ )-2026
## ఒకటి కంటే ఎక్కువ ఓటరు నమోదుల నివారణపై అవగాహన కల్గి ఉండాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమాసింగ్.**



మెదక్, జూన్18( సామాజిక తెలంగాణ ):-

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ( ఎస్ఐఆర్ )-2026 కార్యక్రమంనిర్వహించబడుతున్న సందర్భంగా, ప్రజలు , రాజకీయ పార్టీలు ఓటరు నమోదుకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్లు 17, 18 మరియు 31 ప్రకారం: సెక్షన్ 17: ఏ వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల ఓటరు జాబితాలలో పేరు నమోదు చేసుకోవడానికి అర్హుడు కాదు అని అన్నారు. సెక్షన్ 18: ఒకే నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో ఒకటి కంటే ఎక్కువ సార్లు పేరు నమోదు చేసుకోవడానికి ఏ వ్యక్తికీ అర్హత లేదనీ, సెక్షన్ 31: ఓటరు జాబితా తయారీ, సవరణ, సరిదిద్దడం, పేరు చేర్పు లేదా తొలగింపుకు సంబంధించి ఎవరైనా కావాలని తప్పుడు సమాచారం లేదా అసత్య ప్రకటన సమర్పించినట్లయితే, వారికి ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించబడే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సందర్భంగా ఓటర్లు తమ పేరు ఒకే చోట మాత్రమే నమోదు అయి ఉందో లేదో పరిశీలించుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు ,ప్రజలు ఈ నిబంధనలపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని, స్వచ్ఛమైన ఖచ్చితమైన ఓటరు జాబితాల తయారీలో సహకరించాలని కోరారు.

## పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్...**







మెదక్ , జూన్18( సామాజిక తెలంగాణ):- ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ సర్వేను పురస్కరించుకుని మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్ ప్రోగ్రాం పై బిఎల్ఓ లకు బిఎల్ఎ లకు బి ఎల్ ఓ సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గురువారం గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లు,సూపర్వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎస్.ఐ.ఆర్ సర్వే నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే ఎలా చేయాలి, ఏయే అంశాలను పరిశీలించాలి, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ కీలక అంశాలను వివరిస్తూ బీ.ఎల్.ఓలకు దిశానిర్దేశం చేశారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఎ లు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్ ను పూర్తి చేయాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బీ.ఎల్.ఓలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారివారి శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుంచి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్.ఐ.ఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్ళారా, మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఏమాత్రం సంకోచించకుండా శిక్షణ తరగతులలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క ఓటరు కూడా తప్పిపోకుండా చూడాలని, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర వి.ఐ.పీల మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ.టీ.పీని ఇతరులకు తెలుపకుడదని, ఇలా చేయడం నేరంగా పరిగణించబడుతుందని జాగ్రత్తలు సూచించారు.

## పదో తరగతి మెమో పోయినది

పల్లె బోయిన జానకి తండ్రి పల్లె బోయిన బిక్షం హాల్ టికెట్ నెంబర్ (0867248 ) కల పదవ తరగతి మేము త్రిపురారం గ్రామ శివారులో పోయినది కావున ఎవరికైనా దొరికినట్లైతే మానవతా దృక్పథంతో ఈ మొబైల్ నెంబర్ కు 7569923236 సంప్రదించి ఇవ్వగలరని కోరుచున్నాము.

## శివ్వంపేట మండలంలో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు




శివ్వంపేట/సామాజిక తెలంగాణ
శివ్వంపేట మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ముఖ్యమంత్రి నివాసం ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలువురు పార్టీ నాయకులను వారి నివాసాల వద్దనే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.చట్టం, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అయితే, తమను అకారణంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి నివాసం ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకోవడానికే ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యం

**- తెలంగాణ మోడల్ స్కూల్‌లో నోట్‌బుక్స్ పంపిణీ.**





దౌల్తాబాద్, జూన్ 18 (సామజిక తెలంగాణ)
విద్యార్థులు విద్యారంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థి, విద్యార్థినులకు నోట్‌బుక్స్ అందజేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ సమయంలో క్రమశిక్షణతో చదువుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. గ్రామ పంచాయతీ తరఫున విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యకు ప్రోత్సాహం కల్పించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. నోట్‌బుక్స్ పంపిణీ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి చేరుకునే సామర్థ్యం కలిగి ఉన్నారని, కృషి, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని చెప్పారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఆది బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో ప్రతిభ కనబరచాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలకు అనుగుణంగా మంచి విద్యార్థులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందవచ్చని, అందుకే ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గ ప్రసాద్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు కేంసారం నాగరాజు, పాపగౌని ప్రవీణ్, నాయకులు కర్రోల్ల మల్లేశం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమయం వృధా చేయని యువకుడిని అభినందిన హై కోర్టు న్యాయవాది పెద్దగోని శివకుమార్ గౌడ్



శివ్వంపేట/సామాజిక తెలంగాణ
18.06.26: మెదక్, శివ్వంపేట: ఓవైపు ఉన్నత విద్య చదువుతూ కూడా సమయం ఏ మాత్రం వృధా చేసుకోకుండా.. గార్డెనింగ్ పనిచేయడానికి సైతం వెనకాడకపోవడం ఒక మంచి విషయమే కాగలదని హైకోర్టు న్యాయవాది, శ్రీగురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెదగోని శివకుమార్ గౌడ్ తెలిపారు. తమ దేవాలయ సముదాయంలో జరుగుతున్న గార్డెనింగ్ పనులలో.. మండలంలోని బొజ్యా తండా సర్పంచ్ గా చేసిన రాజు నాయక్ తన సమయం వృధా చేసుకోకుండా.. కష్టపడి చదివి లా సెట్ లో అర్హత సాధించడాన్ని అభినందిస్తూ.. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, ట్రస్టు సభ్యులు శ్రీనివాస్ గౌడ్, సూర్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి ఘన సన్మానం



మందమర్రి, జూన్ 18: (సామాజిక తెలంగాణ):
మందమర్రి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులను బిఆర్ఎస్,అనుబంధ సంఘాల నాయకులు గురువారం టీబీజీకేఎస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గజ్జల చందర్, ప్రధాన కార్యదర్శి సలాముద్దీన్,కోశాధికారి సకినాల శంకర్‌లను పార్టీ పట్టణ అధ్యక్షుడు జే. రవీందర్,టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్,బండారి సూరిబాబు,ఓ రాజశేఖర్, కొంగల తిరుపతి రెడ్డి, శ్రీనివాస్,అబ్బాస్, కనకయ్య ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి వారధులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. నూతన కమిటీ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేసి జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, టీబీజీకేఎస్,బిఆర్ఎస్వి పార్టీ నాయకులు, కార్యకర్తలు,జర్నలిస్టులు,

## విశ్వహిందూ మహాసంఘ్
# జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా

**-దక్షిణ భారత కన్వీనర్‌గా డా. మద్దిశెట్టి సామేలు పునర్నియామకం**



సామాజి తెలంగాణ జూన్ 18 సరోజనాపురం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దంపాడు మండలం సరోజనాపురంవిశ్వహిందూ మహాసంఘ్ జాతీయ అధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు యోగి ఆదిత్యనాథ్ జీ ఆదేశాల మేరకు, జాతీయ కన్వీనర్ మహంత్ ముఖేష్ నాథ్ జీ లిడా. మద్దిశెట్టి సామేలుని మరల విశ్వహిందూ మహాసంఘ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా మరియు దక్షిణ భారత (సౌత్ ఇండియా) కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా డా. మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించిన జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ బలోపేతం, హిందూ ధర్మ పరిరక్షణ మరియు సేవా కార్యక్రమాల కోసం మరింత సమర్థవంతంగా పనిచేస్తానని పేర్కొన్నారు

# పిల్లిగుండ్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరభాస్యం కార్యక్రమం



రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి జూన్ 18,( సామాజిక తెలంగాణ ).

శంకర్పల్లి మండలం పిల్లిగుండ్ల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరభాస్యం మరియు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి స్వాతి కాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తూ చిన్నారులచే అక్షర భాస్యం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచి స్వాతి కాంత్ రెడ్డి మాట్లాడుతూ..చిన్నారుల అందరూ బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలి. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సర్పంచి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ గా పదవిబాధ్యతలు చేపట్టిన ఎ.శ్రీధర్



జోగులాంబ గద్వాల జిల్లా ( సామాజిక తెలంగాణ దినపత్రిక ) జూన్ 18 :

గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ గా ఎ. శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎం గా పనిచేసిన సునీత ఇటీవల హైదరాబాద్ కూకట్ పల్లి కి బదిలీ అయ్యారు. దీంతో ఆమె స్థానంలో శ్రీధర్ కొనసాగనున్నారు. అయితే శ్రీధర్ హైదరాబాద్ రాణిగంజ్ డిపో నుంచి బదిలీపై గద్వాలకు వచ్చారు. ఈమేరకు నూతన డీఎం శ్రీధర్ కు తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు సాదరంగా స్వాగతం పలికి, పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. గద్వాల జిల్లా ప్రజలు, ప్రయాణికులకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందిస్తామన్నారు. అలాగే అన్ని రూట్లలో బస్సులు నడిపి మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ ని ఆదరించాలన్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించవద్దని సూచించారు. సురక్షితమైన ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి ప్రజలు, ప్రయాణికులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ బాల సరస్వతి,ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర పథకాలు అందేలా ప్రతి కార్యకర్త కృషి చెయ్యాలి



గంగాధర, జూన్ 18 ,(సామజిక తెలంగాణ):

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర గ్రామంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దీన్ దయాల్ ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ప్రతి కార్యకర్త గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులతో మమేకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అసెంబ్లీ ప్రబారి బింగి వేణు, మల్యాల అధ్యక్షుడు గాజుల మల్లేష్, మండల ప్రబారీలు అమ్మరకొండ తిరుపతి, నరేష్, ఆకుల మనోహర్, తిప్పల వేణి శ్రీనివాస్, ఎర్రబెల్లి పరశురాం, బొమ్మన పరమేష్, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, తాళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర పథకాలు అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

# మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలి

**- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు.**



మెదక్, జూన్18( సామాజిక తెలంగాణ ):-

భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి కలెక్టర్ ప్రతి మాసింగ్ ఘనం గా ప్రారంభం అయిన వన మహోత్సవం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట మన యోజన పార్క్ ప్రారంభించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావుఅన్నారు. గురువారం జిల్లాలోని రామాయణపేట మండలం అక్కన్నపేట వన యోజన పార్కు అటవీ ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ , డిఎఫ్ఓ జో.జి , డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, తాసిల్దార్ రజిని , ఎంపీడీవో , సర్పంచ్బి యాదగిరి లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ మాధవని రఘునందన్ రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అక్కన్నపేట పార్కుకు రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకూ కోటి నలభై లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నేడు ప్రారంభించనున్న 11 పార్కులకు 22 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. వనాలను రక్షించాలన్నారు. మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. 765 డీజి రోడ్డులో మొదటి దశలో 20 వేల మొక్కలు నాటేందుకు జూలైలో ప్రణాళిక చేయాలని అధికారులకు



సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. 2026 వనమహోత్సవంలో జిల్లాకు కేటాయించిన 31 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. అంతకుముందు అక్కన్నపేట వన యోజన వన యోజన పార్కును ప్రారంభించిన అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ను తిలకించి
మెదక్ ఎంపీ గారితో కలిసి మొక్కలు నాటి
వన మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అరణ్య అర్బన్ పార్కును వర్చువల్ గా ప్రారంభోత్సవం చేసిన సీఎం

**-పాల్గొన్న ఆర్మూర్ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్..**

**వన మహోత్సవంలో భాగంగా మొక్కలు**

**-నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు..**



ఆర్మూర్,జూన్ 18 (సామాజిక తెలంగాణ):

నిజామాబాద్ నగర శివారులో గల మాక్లూర్ మండలం చిన్నాపూర్ వద్ద ఏర్పాటు చేసిన అరణ్య అర్బన్ పార్క్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వర్చువల్ పద్ధతిలో గురువారం గుర్రంగూడ నుండి లాంఛనంగా ప్రారంభించారు. ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి,కలెక్టర్ ఇలా త్రిపాఠి,కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అర్పన,రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, వి. భుజంగ రావు,అదనపు డీసీపీ శుభం ప్రకాష్ నగ్రాలే, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తదితరులు అరణ్య అర్బన్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. సఫారీ వాహనంలో పర్యటించి అర్బన్ పార్క్ లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఓపెన్ జిమ్ లు,వాకింగ్ ట్రాక్,ప్లే జోన్ ఏరియా,కల్వర్టులు, పర్కులేషన్ ట్యాంకులు,వాచ్ టవర్,సోలార్ ద్వారా నడిచే బోరుబావులు,రోడ్డు వసతులను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అటవీ ప్రాంతాన్ని కాపాడడానికి ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ అధికారులు,సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ, వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు,ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అటవీ ప్రాంత అభివృద్ధి కోసం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో అటవీ శాఖ కార్యక్రమాలను సైతం ప్రభుత్వం కొనసాగించిందని గుర్తు చేశారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తెరిగి విరివిగా మొక్కలు నాటి వాటిని



సంరక్షించేలా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చెట్లు నరకడం ఎంతో సులభం అని,కానీ పర్యావరణానికి,ప్రాణికోటికి ఎంతో మేలు చేకూర్చే మొక్కలు నాటి,వాటిని కాపాడడం గురించి ఎంతో మంది తమకు ఎందుకులే అని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి భాగస్వామ్యం ఉన్నప్పుడే, పచ్చదనం పెంపొందించబడుతుందని అన్నారు. జిల్లాలో అటవీ శాఖ పరంగా చేపట్టే కార్యక్రమాలకు. జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ,63వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని,నిజామాబాద్ నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే 476 ఎకరాల విస్తీర్ణంలో అరణ్య అర్బన్ పార్క్ ప్రజలకు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దైనందిన కార్యకలాపాలతో అలసిన వారికి అర్బన్ పార్క్ ఆహ్లాదం పంచుతుందని, వ్యాయామం చేసుకునే వారికి మరింత వెసులుబాటు ఏర్పడిందని అన్నారు. అర్బన్ పార్క్ లో మరిన్ని వసతులు అందుబాటులో తెచ్చేలా జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని అన్నారు. అర్బన్ పార్క్ లో అసాంఘిక శక్తులకు ప్రవేశం లేకుండా గట్టి నిఘా ఉంచాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంత సంరక్షణ, విస్తీర్ణం పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. అడవులకు నష్టం కలిగించే వారి పట్ల అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయన్న,డీఎఫ్ఓ సుధాకర్, సర్పంచ్ లు కే.లత,గంగాధర్, చిన్నా, విద్యార్థిని, విద్యార్థులు,అటవీ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతు బీమా,రైతు భరోసా అమలులో ప్రభుత్వం విఫలం

**-ఏమిరెడ్డి నర్సిరెడ్డి శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్**



శాలిగౌరారం, జూన్ 18,(సామజిక తెలంగాణ):- రైతుల సంక్షేమమే లక్ష్యమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని,బిఆర్ఎస్ నాయకుడు శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఏమిరెడ్డి నర్సిరెడ్డి విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ రైతు బీమా,రైతు భరోసా,ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోలు తదితర అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతు బీమా పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన వందల కోట్ల రూపాయల ప్రీమియంను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వేలాది రైతు కుటుంబాల క్లెయిమ్‌లు పెండింగ్‌లో పడ్డాయని అన్నారు. రైతు మరణిస్తే పది రోజుల వ్యవధిలోనే కుటుంబ సభ్యుల ఖాతాలో రూ.5 లక్షలు జమయ్యే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు.ఎకరాకు రూ.15 వేల సాయం ఇస్తామని ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి రైతులను నట్టేట ముంచారని అన్నారు.మూడు సంవత్సరాలు గడిచినా రైతులకు పూర్తిస్థాయిలో పెట్టుబడి సాయం అందలేదని,కోట్లాది రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు.ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2,500 ,నిరుద్యోగ భృతి,కౌలు రైతులకు ఆర్థిక సాయం,ఆటో కార్మికులకు సహాయం,పెరిగిన పింఛన్లు.. ఇలా చెప్పిన ప్రతి హామీ కాగితాలకే పరిమితమైందని విమర్శించారు.వ్యవసాయానికి ప్రాణాధారమైన ఎరువుల విషయంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నర్సిరెడ్డి ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియా అందించలేక యాప్‌ల పేరుతో కొత్త ఇబ్బందులు సృష్టిస్తోందని అన్నారు. చదువులేని రైతులు,స్మార్ట్‌ఫోన్ లేని రైతులు యాప్‌ల ద్వారా ఎరువులు పొందడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. యూరియా అందుబాటులో ఉంటే యాప్‌ల అవసరమే ఉండదని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోళ్లలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని,రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర, సకాలంలో కొనుగోళు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి సాయం,బీమా రక్షణ ఏదీ సక్రమంగా అందని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే రైతు బీమా ప్రీమియం బకాయిలను చెల్లించి పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలని,రైతు భరోసా బకాయిలను విడుదల చేయాలని, యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు.



మా కెరుకేలే సిన్నా నీవు అరకే పడతావని
సుద్దముక్కలెరుగని విశ్వవిద్యాలయంలో
కానరాని విధ్యార్థివి నీవని
ఐదువేళ్ళ తరగతిగదిలో
ఆకలి ప్రశ్నలకు మెతుకులతో సమాధానం
చెప్పే జ్ఞానివి నీవని మాకెరుకేలే సిన్నా
బండరాళ్ళగుండెల్లో దొరికిన దాహానికి
సెలకల సెలిమెల్లో దాగిన మంచినీళ్ళ ఊటవునీవని మా కెరుకేలే సిన్నా
బంజరు భూముల్లో
సెమటసుక్కల కళ్ళాపు జల్లుతావని
విత్తనాల ముగ్గులేస్తావని
కలుపుమొక్కల పై యుద్ధం చేసి
మెతుకుల సింహాసనాన్ని ఏలుతావని
మాకెరుకేలే సిన్నా
"ఆకలి పాఠశాలలో – ఓ మెతుకుల విద్యార్థి"
మీ అన్వేషి

# లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

**-ఇళ్లు లేని ప్రతి పేద వాడికి ఇందిరమ్మ ఇళ్లను అందజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.**

**-మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ.**



(కరీంనగర్ జిల్లా/తిమ్మాపూర్ సామాజిక తెలంగాణ పత్రిక ప్రతినిధి)జూన్-18 మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డి లోని ప్రజాభవన్ కార్యాలయంలో గురువారం తిమ్మాపూర్ ,గన్నేరువరం ,మానకొండూర్ మండలాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు.తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు ప్రభుత్వం ఇంటి మంజూరు పత్రాలను (ప్రొసీడింగ్స్) వేగంగా పంపిణీ చేస్తోంది.తాజాగా చేపట్టిన రెండో విడతలో భాగంగా గుడిసెల్లో నివసించే నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ,ప్రతి లబ్ధిదారుడికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్నారు.పథకం ముఖ్య సొంత స్థలం ఉండి ఇళ్లు లేని అర్హులైన పేదలకు ఈ పథకం కింద రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందిస్తోంది.ఈ మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాన్ని మండల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి,దశలవారీగా (ఫౌండేషన్,గోడలు,రూఫ్ దశల్లో)నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమచేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.గూడులేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి,ఎంపీడీఓ రాజీవ్ మాల్త్రో, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ,పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# ఎస్సీ బాలుర హాస్టల్లో అడ్మిషన్లు ప్రారంభం

ఖానాపూర్, జూన్ 18 ,(సామజిక తెలంగాణ): ఖానాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో 2026--27 విద్యా సంవత్సరానికి మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం 60 సీట్లు ఖాళీగా ఉన్నట్లు సంక్షేమ అధికారి భాస్కర్ తెలిపారు.అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులు ఆధార్, ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలు, బోనఫైడ్ సర్టిఫికెట్, బదిలీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.హాస్టల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత వసతి, పౌష్టికాహారం, పుస్తకాలు, డ్రెస్సులు, వైద్య సేవలు, పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణతో కూడిన విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.సీట్లు పరిమిత సంఖ్యలో ఉన్నందున ఆసక్తిగల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9441353430 నంబర్‌ను సంప్రదించవచ్చని వార్డెన్ భాస్కర్ తెలిపారు.పేద వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టల్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి.

# జాతీయ లోక్ అదాలత్‌లో ఖానాపూర్ న్యాయవాదులకుఅవకాశం



ఖానాపూర్, జూన్ 18 ,(సామజిక తెలంగాణ): జాతీయ న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు జూన్ 20న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఖానాపూర్‌లో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రకారం, పెండింగ్ కేసులు, ప్రీ-లిటిగేషన్ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ఈ బెంచ్ ఏర్పాటు చేయబడింది. అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ నికిత అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగనుంది. ఈ బెంచ్‌లో ఖానాపూర్‌కు చెందిన న్యాయవాదులు జి. నరేంద్రనాథ్, షబ్బీర్ పాషా సభ్యులుగా నియమితులయ్యారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో వివాదాలను పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందని వారు తెలిపారు.జిల్లా న్యాయశాఖ తమపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, విధులను సక్రమంగా నిర్వహిస్తామని నరేంద్రనాథ్, షబ్బీర్ పాషా హామీ ఇచ్చారు.జాతీయ లోక్ అదాలత్‌లో ఖానాపూర్ న్యాయవాదులకు కీలక బాధ్యతలు అప్పగించారు .

# ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత పుస్తకాల పంపిణీ



ఖానాపూర్, జూన్ 18,(సామజిక తెలంగాణ): ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ చీర్ల విజయ్ ఆనంద్ కుమార్ చేత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలలపై మోజు వద్దని తల్లిదండ్రులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ ప్రైమరీ నుండి కాలేజీ వరకు ఒకే చోట విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అందించే సౌకర్యాలను . వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో .ప్రధానోపాధ్యాయుడు జాన బ్రహ్మలింగం, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఏపీ చైర్మన్, ఉపాధ్యాయురాలు కె. మౌనిక తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని సర్పంచ్ విజయ్ ఆనంద్ పేర్కొన్నారు .

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన



తిమ్మాపూర్, జూన్ 18 ,(సామజిక తెలంగాణ): :కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూరులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం పరిశీలించారు.వరంగల్ రోడ్ నుంచి పోచమ్మ కల్వర్టు వరకు జరుగుతున్న పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, కె. కొమురయ్య, తుర్తి అరవింద్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, చింతల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అల్గునూరులో డ్రైనేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.

# గుడిసెలు లేని గ్రామాలే ప్రభుత్వం లక్ష్యం-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ





**తిమ్మాపూర్, జూన్ 18 ,(సామజిక తెలంగాణ):**
ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ కాలనీలో తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్ల మంజూరు జరుగుతోందని, పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని కల్పిస్తుందని, అందుకే పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. మొదటి విడుతలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులను తొలగించి, మిగితా అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని, త్వరలో రెండో విడుత జాబితా విడుదలవుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు మల్హోత్రా, శ్రీనివాస్ రెడ్డి, వీవీ వరలక్ష్మి, తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి రమేశ్, బొడ్డు సునిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, మాతంగి అనిల్, బుర్ర తిరుపతి గౌడ్, పొన్నాల సంపత్, ఎల్లారెడ్డి తోపాటు సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.పేదలందరికీ ఇళ్లు మంజూరు చేసి గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు .

## ఘనంగా అమ్మ మాట అంగన్వాడి బాట



**కరీంనగర్, జూన్ 18 ,(సామజిక తెలంగాణ):**
ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ కోతి రాంపూర్ సెక్టార్‌లోని గణేష్‌నగర్, ధోబివాడ అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా 57వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలు, గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో అందించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సూపర్వైజర్ ఎస్. అరుణ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ఆటపాటల ద్వారా నేర్పిస్తూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీలు పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి. పద్మావతి, వనజ, బి. విజయ, బి. పద్మలత, పి. విజయ, ఏఎన్ఎం సుప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15 మంది చిన్నారులకు కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ చేతుల మీదుగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.అంగన్వాడీ సేవలను వినియోగించుకొని పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు చురుకుగా పాల్గొనాలని అధికారులు సూచించారు .

## నీరు విడుదల చేయకపోతే రైతు ఉద్యమం చేపడతాం



**కరీంనగర్ రూరల్, జూన్ 18 ,(సామజిక తెలంగాణ):**
కొత్తపల్లి మండలంలోని గ్రామాలకు వారం రోజుల్లోగా సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి ఆచంపల్లి వద్ద మహాధర్నా చేపడతామని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు. బద్దిపల్లి గ్రామంలో రైతుల ఆహ్వానం మేరకు పంట పొలాలు, చెరువులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ చుక్క వర్షం లేక బావులు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేస్తేనే పంటలు రక్షించబడతాయని తెలిపారు.గతంలో వరద కాలువ ద్వారా చెరువులను నింపి సాగునీరు అందించడంతో పాటు మత్స్యకారులకు ఆదాయం పెరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుతం మేడిగడ్డ నుండి నీరు రాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని, వారం రోజుల్లోగా నీరు విడుదల చేయకపోతే రైతు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. లెఫ్ట్ కెనాల్ పనులను పునరుద్ధరించి శ్రీరాములపల్లి గ్రామానికి కూడా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి మహాధర్నా చేపడతామని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.

## తాత్కాలిక సెక్యూరిటీ గార్డులకు న్యాయమైన వేతనం ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్



**కరీంనగర్, జూన్ 18 ,(సామజిక తెలంగాణ):**
ఫంక్షన్ హాల్స్, గార్డెన్స్‌లో తాత్కాలికంగా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు రోజుకు 8 గంటల పనికి రూ.800 చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది.సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ అధ్యక్షుడు పున్నం రవి ఆధ్వర్యంలో రేకుర్తి రాజశ్రీ గార్డెన్, సాయి మహాలక్ష్మి గార్డెన్, శుభం గార్డెన్, వరలక్ష్మి గార్డెన్ తదితర మేనేజర్లకు వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో గార్డులకు తగిన వేతనం ఇవ్వాలని, అలాగే ఈఎస్ఐ, పీఎఫ్, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నోముల జగన్, పరుశురాం, సుంకరపల్లి ప్రవీణ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. తాత్కాలిక సెక్యూరిటీ గార్డులకు న్యాయమైన వేతనం ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్ చేసింది .

## నిబంధనలకు విరుద్ధంగా బదిలీలపై విచారణ జరుపాలని ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్



**కరీంనగర్, జూన్ 18,(సామజిక తెలంగాణ):**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలు, సీనియారిటీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు కె. బద్రినేతతో కలిసి డీఎం అండ్ హెచ్‌ఓకి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు చామనపల్లి పీహెచ్‌సీలో ఎంపీహెయోగా పనిచేస్తున్న చిలుక లింగయ్య సీనియారిటీ వివరాలను తప్పుగా చూపించి బదిలీల నుండి తప్పించుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఫోకల్ టు ఫోకల్ బదిలీలు పొందడం, అక్రమంగా హెచ్ఆర్ఏ పొందడం వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఫిర్యాదును స్వీకరించిన డీఎం అండ్ హెచ్ఓ ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలు నిరూపితమైతే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఫోకల్ టు ఫోకల్ బదిలీలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఎం అండ్ హెచ్ఓ స్పష్టం చేశారు.

## ప్రైవేటు స్కూలు బస్సులు అడ్డగింత



**పాలకుర్తి, జూన్ 18 ,(సామజిక తెలంగాణ):**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం గురువారం కూడా ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను గ్రామ శివారులో అడ్డగించింది.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని పాలకవర్గం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయాన్ని కొందరు సమర్థిస్తుండగా, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. బడి వసతులు సరిగా లేవని, అపరిశుభ్రంగా ఉందని, ఆకతాయిలు బడి ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, ప్రభుత్వం నాణ్యమైన ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందజేస్తుందని, ప్రభుత్వ బడికి పూర్వ వైభవం తీసుకురావడంలో అందరి సహకారం కావాలని తల్లిదండ్రులను నచ్చజెప్పారు.దీంతో ఒక్కరోజులోనే ప్రైవేటు స్కూలు నుండి ప్రైమరీలో 22 మంది, హై స్కూలులో 8 మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరారు. ఆదివారం రోజున జిల్లా విద్యాశాఖ అధికారులతో గ్రామస్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ప్రైవేటు బస్సులు అడ్డగింతతో ఒక్కరోజులోనే 30 మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరారు.

## విజయవంతంగా ముగిసిన జేఎస్ఆర్ చలివేంద్రాలు



**హుస్నాబాద్, జూన్ 18 ,(సామజిక తెలంగాణ):**
హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు విజయవంతంగా ముగిశాయి.ప్రతి ఏడాది మాదిరిగానే ఈ వేసవిలో కూడా ప్రజల దాహార్తిని తీర్చేందుకు 20 చలివేంద్రాలను ఏర్పాటు చేసి, సుమారు 25 లక్షల లీటర్ల కూల్ మినరల్ వాటర్‌ను ప్రజలకు అందించారు. ఇందుకోసం జేఎస్ఆర్ స్వంతంగా రూ.50 లక్షలు వెచ్చించారు. వేసవి తీవ్రతలో బాటసారులు, వాహనదారులు, ప్రజలకు ఉచితంగా చల్లని నీరు అందించడం ద్వారా వేలాది మందికి ఉపశమనం కలిగిందని స్థానికులు తెలిపారు.100 రోజుల పాటు చలివేంద్రాల నిర్వహణలో కీలకంగా పనిచేసిన టీం సభ్యులు రాహుల్, అఖిల్‌లను జేఎస్ఆర్ శాలువాలతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, సీనియర్ నాయకులు కాయిత అరుణ్ రెడ్డి, టౌన్ కార్యదర్శి బుర్ర రాజు, టీం జేఎస్ఆర్ సభ్యులు పాకల రాజిరెడ్డి, కనకం వెంకట్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.ప్రజాసేవలో భాగంగా జేఎస్ఆర్ చేపట్టిన చలివేంద్రాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన




**శంకరపట్నం, జూన్ 18 ,(సామజిక తెలంగాణ):**
గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మౌలిక వసతులు కీలకమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు .ధర్మారం గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రూ.41 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పుడే గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శిస్తూ, ప్రస్తుతం కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు, తాగునీటి పథకాలు చేపడుతున్నామని తెలిపారు. ధర్మారం గ్రామంలో సీసీ రోడ్డు పూర్తయితే వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రవి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, గ్రామ సర్పంచ్ చింతిరెడ్డి పద్మ, పార్టీ నాయకులు దేవునూరి కిష్టయ్య, నాంపెల్లి తిరుపతి, గట్టు తిరుపతి గౌడ్, గోపగోని బస్వయ్య గౌడ్, ఉప్పుగళ్ల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మౌలిక వసతులు అత్యవసరమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు .

# బిజినెస్

# వరుసగా ఐదో సెషన్‌లోనూ లాభపడ్డ స్టాక్ మార్కెట్లు..

## సెన్సెక్స్ 254 పాయింట్లు లాభం

భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. వరుసగా ఐదో సెషన్‌లోనూ స్టాక్ మార్కెట్లు లాభాలు పొందడం విశేషం. గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు (0.33 శాతం) లాభపడి 77,409.98 పాయింట్ల వద్ద ముగిసింది. ఒక దశలో 77.492.33 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 82.30 పాయింట్లు (0.34 శాతం) లాభపడి 24,168 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 0.33 శాతం, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 0.43 శాతం లాభపడ్డాయి.గత ఐదు సెషన్లలో స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే ముగిశాయి. ఐదు సెషన్లలో బీఎస్ఈ సెన్సెక్స్ 4.8 శాతం, నిఫ్టీ 4.3 శాతం లాభాలు పొందాయి. రూపాయి విలువ బలపడి 16 పైసలు పెరిగింది. డాలర్‌తో 94.32



వద్ద రూపాయి కొనసాగింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 2.1 శాతం తగ్గి 77.8 డాలర్ల వద్ద కొనసాగింది. డబ్ల్యూటీఐ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76 డాలర్ల దిగువకు చేరింది. గురువారం బ్యాంకింగ్, ఫైనాన్స్ సెక్టార్ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఎస్బీఐ 1.64 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.419 శాతం, యాక్సిస్ బ్యాంక్ 0.67 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.39 శాతం లాభపడ్డాయి. అయితే, ఐటీ స్టాక్స్ ఒత్తిడిని ఎదుర్కొని నష్టాల బాటలో నడిచాయి. ఇన్ఫోసిస్ షేర్లు అత్యధికంగా 2.66 శాతం నష్టపోగా, టెక్ మహీంద్రా షేర్లు 1.07 శాతం, టీసీఎస్ షేర్లు 0.82 శాతం, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 0.41 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ షేర్లలో అత్యధికంగా ఇండిగో సంస్థ ఈ రోజు భారీ లాభాలు పొందింది. ఇండిగో మాతృ సంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ సంస్థ 2.73 శాతం లాభపడగా, ట్రెంట్ సంస్థ షేర్లు 2.52 శాతం లాభపడ్డాయి. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడం, అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం, శుక్రవారం నుంచి హార్మూజ్ జలసంధి పూర్తిగా తెరుచుకోనుండటం వంటివి మార్కెట్లు లాభాలబాటలో నడిచేందుకు కారణమయ్యాయి.

### జులై నుంచి కియా

## కార్ల ధరలు పెంపు




డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ముడిసరకుల ధరలు పెరగడంతో ఆటోమొబైల్ కంపెనీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో, కియా ఇండియా తన కార్ల ధరలను జులై నుంచి 2 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ముడిసరకుల ఖర్చు, నిర్వహణ వ్యయం పెరగడమే దీనికి కారణమని కంపెనీ పేర్కొంది. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్, EV సెగ్మెంట్‌లోని మోడళ్లను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని తెలిపింది.

## మళ్లీ తగ్గుతున్న బంగారం, వెండి ధరలు.. తులం ఎంతంటే?

బంగారం కొనే వారికి ఇదొక గుడ్‌న్యూస్ అనే చెప్పాలి. ఎందుకంటే గత కొన్నాళ్లుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. బుధవారంతో పోల్చుకుంటే గురువారం ఉదయం 6గంటల వరకు బంగారం ధరల్లో స్వల్ప మార్పులు కనిపించాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో 24 క్యారట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 151,090 వద్ద కొనసాగుతుండగా బుధవారం ఈ ధర రూ.1,51,360గా ఉంది. అంటే బుధవారం పోల్చుకుంటే గురువారరి రూ.300 వరకు దిగొచ్చింది. ఇక 22 క్యారట్ల బంగారం ధర చూసుకుంటే దీనిపై కూడా రూ.200పైగా తగ్గి ప్రస్తుతం 10 గ్రాముల ధర రూ.1,38,490 వద్ద స్థిరపడింది. ఇక వెండి కూడా బంగారం బాటలోనే నడుస్తోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.2,64,900 వద్ద కొనసాగుతుంది.

ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..



హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,090. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,38,490 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,74,900గా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,51,090. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,38,490 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,74,900 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,51,090. 22 క్యారెట్ల ధర రూ.1,38,490 ఉంది. వెండి కిలో ధర రూ.2,64,900 లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,51,090, 22 క్యారెట్ల ధర రూ.1,38,490 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,64,900 లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,51,240. 22 క్యారెట్ల ధర రూ.1,36,640 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,64,900 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.153,050, 22 క్యారెట్ల ధర రూ.1,40,290 ఉంది. వెండి కిలో ధర రూ.2,74,900 ఉంది.

# స్పోర్ట్స్

## భారత హాకీ స్టార్ మన్‌ప్రీత్ సింగ్ సరికొత్త రికార్డు..

### -దిలీప్ టిర్కీ రికార్డు బ్రేక్

భారత హాకీ జట్టు స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ చరిత్ర సృష్టించాడు. దేశం తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మన్‌ప్రీత్ తన 413వ మ్యాచ్ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో హాకీ ఇండియా ప్రస్తుత అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేరిట ఉన్న 412 మ్యాచ్‌ల రికార్డును మన్‌ప్రీత్ అధిగమించాడు. ఈ చారిత్రక ఘనతను గుర్తిస్తూ హాకీ ఇండియా.. మన్‌ప్రీత్ సింగ్‌ను అభినందించి, రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. పదిహేనేళ్లుగా భారత హాకీ జట్టుకు మన్‌ప్రీత్ గుండెకాయలా నిలుస్తున్నాడని, ఆయన నిలకడ అసాధారణమని కొనియాడింది. 2011లో 19 ఏళ్ల వయసులో భారత జట్టులోకి అడుగుపెట్టిన మన్‌ప్రీత్, టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాలు సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ప్రపంచంలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ ఐదో స్థానంలో నిలువడం విశేషం. ఈ మైలురాయిపై మన్‌ప్రీత్ సింగ్ స్పందిస్తూ.. 'భారత్ తరఫున ఇన్ని మ్యాచ్‌లు ఆడటం గర్వంగా ఉంది. ఈ విజయాన్ని నా సహచరులకు, కుటుంబసభ్యులకు అంకితం చేస్తున్నా' అన్నాడు. ఒలింపిక్ స్వర్ణం, ప్రపంచ కప్ గెలువాలనేదే తన లక్ష్యమని ఆయన స్పష్టంచేశాడు. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ మాట్లాడుతూ.. 'మన్‌ప్రీత్ అంకితభావం, నిలకడకు ఈ రికార్డు నిదర్శనం. భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తి' అని ప్రశంసించారు. హాకీ ఇండియా సెక్రెటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ కూడా మన్‌ప్రీత్‌ను ప్రశంసించారు.



## ఐపీఎల్‌కు ఎండావాన సెగ..

### 2027 ఎడిషన్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం..!




వేసవిలో క్రీడా వినోదం పంచే ఇండియన్ ప్రీమియర్ లీగ్ విషయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయానికి సిద్ధమవుతోంది. ప్రతి సీజన్‌ను మార్చి నెలాఖరులో ప్రారంభించే బీసీసీఐ.. 2027 ఎడిషన్ విషయంలో ముందు చూపుతో వ్యవహరించాలనుకుంటోంది. సీజన్ మధ్యలో మండు టెండలు, అకాల వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఐపీఎల్ 2027ను కాస్త ముందుగానే జరపాలని భావిస్తోంది. ఈ విషయమై ఐపీఎల్ వచ్చే సీజన్ షెడ్యూల్‌పై గురువారం బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా హింట్ ఇచ్చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2027ను ముందుగానే మొదలెట్టాని బీసీసీఐ భావిస్తోంది. సెక్రటరీ దేవజిత్ సైకియా ఇదే అంశంపై మాట్లాడుతూ.. 'ఈ ఏడాది ఐపీఎల్ మార్చి 29(28) వ తేదీన ప్రారంభమైంది. అయితే.. మే రెండో వారం టోర్నీ సమయంలో వర్షాలు పడుతున్నాయి. ముందుస్తు వానల కారణంగా టోర్నీకి అంతరాయం కలుగుతోంది. అలానే ఎండ తీవ్రతకు ఆటగాళు, అభిమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ, ఐపీఎల్ కార్యనిర్వాహణ మండలి కీలక ఆలోచన చేస్తోంది. ఐపీఎల్ 2027ను మార్చి నెలాఖరున కాకుండా ముందుగానే జరపాలని భావిస్తున్నాం. మార్చి 10 నుంచి మార్చి 15 మధ్య సీజన్‌ను ఆరంభించే అవకాశముంది' అని దేవజిత్ సైకియా వెల్లడించాడు. అంతేకాదు షెడ్యూల్ ముందుకు జరిపాలని అభిమానుల నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. దాంతో, మే 15 కల్లా టోర్నీని ముగించాలని భావిస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి పేర్కొన్నాడు. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఐపీఎల్ 19వ సీజన్ కాస్త ఆలస్యమైన విషయం తెలిసిందే.

## లార్డ్స్‌లో టీమిండియాతో టెస్టు.. పకడ్బందీగా ఇంగ్లండ్ స్క్వాడ్..!




మహిళల పొట్టి ప్రపంచకప్ ముగియడమే ఆలస్యం ఇంగ్లండ్, భారత జట్ల మధ్య టెస్టు పోరు మొదలవ్వనుంది. మూడు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌లో భారత జట్టును చిత్తు చేసిన ఆతిథ్య జట్టు.. ఈసారి లార్డ్స్ (రాశీతీఎం) మైదానంలో బిగ్ ఫైట్‌కు సిద్ధమవుతోంది. ఇరుజట్ల మధ్య తొలి టెస్టు కోసం గురువారం ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించింది.స్వదేశంలో పొట్టి సిరీస్‌లో భారత మహిళల జట్టును 2-0తో ఓడించిన ఇంగ్లండ్ లార్డ్స్ టెస్టులో పకడ్బందీగా బరిలోకి దిగనుంది. ఈ మైదానంలో ఇరుజట్లు తొలిసారి ఎర్ర బంతితో తలపడనున్నాయి. దాంతో, నాట్ సీవర్ బ్రంట్ కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని ఇంగ్లండ్ వేల్స్ బోర్డు ప్రకటించింది.జూలై 10 నుంచి జరిగే ఈ మ్యాచ్‌తో ఆల్‌రౌండర్ అలీసే క్యాప్సే, టిల్లీ కార్టిన్ -- కొలేమన్, మాడీ విల్లెర్స్‌లు టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నారు. అలానే స్క్వాడ్‌లోని గ్రేస్ పాట్స్, ఎల్లీ త్రెల్‌కెల్డ్‌లు అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ ఆడనున్నారు.

**ఇంగ్లండ్ టెస్ట్ స్క్వాడ్ :**

నాట్ సీవర్ బ్రంట్(కెప్టెన్), టమ్మీ బ్యూమంట్, లారెన్ బెల్, మలా బౌచర్, అలీసే క్యాప్సే, టిల్లి కార్టిన్ కొలెమన్, సోఫీ ఎకిల్‌స్టోన్, లారెన్ ఫైలర్, అమీ జోన్స్(వికెట్ కీపర్), హీథర్‌నైట్, ఎమ్మా లాంబ్, గ్రేస్ పాట్స్, ఎల్లె త్రెల్‌కీడ్, మాడీ విల్లెర్స్, ఇస్సీ వాంగ్.

### ఆసియా క్రీడలకు దూరమైన

## టేబుల్ టెన్నిస్ స్టార్..!



ప్రతిష్మాత్మక ఆసియా క్రీడల ఆరంభానికి ముందే భారత్‌కు బిగ్ షాక్. పలు పోటీల్లో పతకాలు గెలిచిన టెన్నిస్ క్రీడాకారిణి మనికా బత్రా అనూహ్యంగా 20వ ఆసియా క్రీడలకు దూరమైంది. మహిళల విభాగంలో ఫేవరెటైన మనికా నిర్దేశించిన అర్హత ప్రమాణాలను అందుకోలేదు. దాంతో, భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య ఆమెను స్క్వాడ్ నుంచి తప్పించింది.ఆసియా క్రీడల్లో పతకం కొల్లగొట్టాలనుకున్న మనికా బత్రా ఆశలు ఆవిరయ్యాయి. ఇటీవల కాలంలో దేశవాళీ పోటీలకు డుమ్మా కొట్టడంతో ఫలితంగా ఆమెకు టీటీఎఫ్ఐ ర్యాంకింగ్స్ రాలేదు. కాబట్టి.. ఆసియా క్రీడల స్క్వాడ్ నుంచి మనికను తప్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ టోర్నీలో స్వస్తికా ఘోష్‌తో పాటు రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైంది మనికా. కానీ, ఇప్పుడు అనూహ్యంగా ఆమె టోర్నీకి దూరమైంది. మనిక గైర్హాజరీలో భారత బృందానికి శ్రీజ నాయకత్వం వహించనుంది. జపాన్ వేదికగా 20వ ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకూ జరుగనున్నాయి.

# ఇండియా స్టోరీ పోస్టర్ విడుదల




బాలీవుడ్ నటులు కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సోషియో నేషనల్ డ్రామా 'ది ఇండియా స్టోరీ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్స్ / స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చెత్తన్ డీకే దర్శకత్వం వహిస్తుండగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా ఉన్నారు. దేశంలో తీవ్రమవుతున్న ఆహార కల్తీ, వ్యవసాయంలో రసాయనాలు, పురుగుమందుల మితిమీరిన వాడకం వెనుక ఉన్న కుంభకోణాల చుట్టూ ఈ చిత్ర కథ సాగనుంది. బాంబే హైకోర్టు నేపథ్యంలో గ్రిప్పింగ్ కోర్టు రూమ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో, శ్రేయాస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రి పాత్రలో కనిపించనున్నారు. జీ స్టూడియోస్ ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్న 'ది ఇండియా స్టోరీ' 2026 జూలై 24న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.



**చీరలో మెరిసిపోతున్న ఐశ్వర్య రాజేష్**

## దేశ విభజన నేపథ్యంలో సన్నీ డియోల్ 'బట్వారా 1947'..

### ఆసక్తికరంగా టీజర్!




బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' (దీఘ్‌ఝుతీఘు 1947) నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హాజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.



## 'మైసా'లో నక్సలైట్‌గా?

అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాల్లో రష్మిక ఫెరోషియస్ లుక్స్‌తో సర్‌ప్రైజ్ చేసింది. ఈ సినిమాలో ఆమె గోండు తెగకు చెందిన గిరిజన మహిళ పాత్రను పోషిస్తున్నది. కెరీర్‌లో తొలిసారి ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌చేస్తుండటంతో ఈ సినిమా విషయంలో రష్మిక మందన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ఆమె నక్సలైట్ పాత్రలో కనిపించనుందని తెలిసింది. వ్యవస్థపై ధిక్కార స్వరం వినిపించే ధీరోదాత్తురాలైన గిరిజన మహిళగా ఆమె పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. అయితే ఆమె పాత్ర తాలూకు అసలైన వివరాలు తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. పాన్ ఇండియా రిలీజ్ కానుంది.

## అనిల్ రావిపూడి మరో మల్టీస్టారర్ ప్రాజెక్ట్

### వెంకటేశ్, కళ్యాణ్ రామ్ మూవీకి శ్రీకారం



టాలీవుడ్‌లో మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి తెరలేచింది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా తెరకెక్కబోతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు దిగ్గజ దర్శకుడు రాఘవేంద్రరావుతో పాటు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తదితరులు విచ్చేసి క్లాప్ కొట్టారు. ఇక ఈ సినిమాలో నటించబోయే కథానాయికలకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌లో వెంకీ మామకు జోడీగా నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ నటిస్తోండగా.. నందమూరి హీరో కళ్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి సందడి చేయనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా.. సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం వహిస్తున్నాయి. అనిల్ రావిపూడికి బాగా కలిసివచ్చిన సంక్రాంతి సీజన్‌నే ఈ సినిమాకు కూడా లాక్ చేశారు. 2027 సంక్రాంతి కానుకగా ఈ అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దగ్గుబాటి మరియు నందమూరి వంశాల హీరోలు కలిసి నటిస్తుండటంతో, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై అటు అభిమానుల్లో, ఇటు సాధారణ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

## లంకా దహనం సీత చేస్తే..



అలియాభట్, శార్వరి వాఘ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫిమేల్ ఓరియెంటెడ్ స్పైథ్రిల్లర్ 'ఆల్ఫా' సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. యశ్‌రాజ్ ఫిల్మ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రానుంది. ఇందులో అలియాభట్ గూఢచారి పాత్రలో కనిపించనుంది. దేశానికి వ్యతిరేకంగా 'ఆల్ఫా' పేరుతో ప్రతినాయకుడు నడిపే మిషన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా అలియాభట్ బృందం చేసిన సాహసాలు ఏమిటన్నదే ఈ సినిమా ఇతివృత్తం. హై ఇంటెన్సిటీ యాక్షన్‌తో ట్రైలర్ ఆద్యంతం థ్రిల్‌ని పంచింది. బాబీడియోల్ క్రూరుడైన విలన్ పాత్రలో కనిపించాడు. 'సీత లంకాదహనం చేస్తే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా' అంటూ అలియాభట్ చెప్పిన డైలాగ్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆదిత్యచోప్రా నిర్మాణంలో శివ్ రవాలీ దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 3న ప్రేక్షకుల ముందుకురానుంది.

Printed published owned by P Venkataramana H No 150/2 Road no 4 Midhani colony injapur abdullapur met mandal Rangareddy dist TS 501510. printed At Kiran< printers H No 150/2 Road No 4 abdullapur met mandal Rangareddy dist Ts 501510.published from Podila Publications editor P Venkataramana RNi No Aptel/ 20011/39851 mobile no 9133399979/7330899979 email. Samajikanews10@gmail.com